వార్త
ఆదివారం
23 అక్టోబరు, 2022

# జగమంతా వెలుగు దివ్వెలు



# ఎన్టీఆర్ సరసన శ్రీలీల?

ఎన్టీఆర్ తన ముప్పైవ సినిమాను కొరటాల దర్శకత్వంలో చేయనున్నాడు. ప్రస్తుతం అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందనుంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ హీరోయిన్‌ను తీసుకోవాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్టుగా టాక్ వినిపించింది. ఈ చిత్రం కోసం ముందుగా అలియా భట్ పేరు వినిపించినప్పటికీ ఆ తరువాత పూజాహెగ్డే, రష్మిక, కియారా అద్వానీ పేర్లు తెరపైకి వచ్చాయి. మొదటి కథానాయికగా ఈ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు వినికిడి. ఇక.. రెండవ కథానాయికగా శ్రీలీలను తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపుగా ఆమె ఎంపిక ఖరారైనట్లేనని వినికిడి. 'పెళ్లిసందడి' సినిమాతో పరిచయమైన ఈ అమ్మడు త్వరలో 'ధమాకా'తో పలకరించనుంది. బాలకృష్ణ, నితిన్ సినిమాల్లోనూ కనిపించనుంది. రామ్-బోయపాటి సినిమాల్లోనూ ఛాన్స్ కొట్టేసింది.





# 'పుష్ప 2' త్వరలో రెగ్యులర్ షూటింగ్?

అల్లు అర్జున్-సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'పుష్ప' సంచలన విజయం సాధించింది. విడుదలైన ప్రతి భాషలో, ప్రతి ప్రాంతంలో వసూళ్ల పరంగా కొత్త రికార్డులను నమోదు చేసింది. ఆ సినిమాకి సీక్వెల్‌గా 'పుష్ప 2' సెట్స్ పైకి వెళ్లనుందనే సంగతి విదితమే. ఫస్టు పార్టు పాన్ ఇండియా స్థాయిలో కనెక్ట్ కావడంతో, సెకండ్ పార్టును కూడా ఆ స్థాయి బడ్జెట్‌లోనే వుంటుందని టాక్. కథలో మార్పులు, మరికొంత మంది నటులను యాడ్ చేసుకోవడం వల్ల ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలో షూటింగు మొదలు కానుంది. ఈ చిత్రంలో రష్మికతో పాటు మరో కథానాయికకి అవకాశం ఉండనున్నట్లు సమాచారం. తమిళం నుండి విజయ్ సేతుపతిని, బాలీవుడ్ నుంచి అర్జున్ కపూర్‌ను తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దేవిశ్రీ మాస్ మసాలా ట్యూన్స్‌ను రెడీ చేసినట్లు టాక్. ఇక ఐటమ్ సాంగ్‌లో కాజల్ మెరవనున్నట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

23 అక్టోబరు, 2022


## మంచి ముత్యాలు

బాహ్యంగా ప్రదర్శింపబడే ప్రేమ కాక అంతర్గతంగా వుండే ప్రేమాభిమానాలే మనకు అవసరం.

- తిరుక్కురళ్

## విషయ విశేషం


చెక్క కార్లు.... 4

'సంఘీ'భావం....5

ప్రక్షాళనకు నోచుకోని విద్యారంగం

వింతలకు నిలయం...6

కవర్ స్టోరీ..8

జగమంతా

వెలుగు దివ్వెలు

ఈవారం కవిత్వం..12

ఎందుకో

డిజిటల్ యుగం..14

నవ్వు దివ్యౌషధం..18

కథ.. 20

సెల్యూట్

సాహిత్యం.. 23

తెలంగాణ సాహితీ వైభవం

మూర్ఖ జనం...26

చిత్రభారతి.. .30

సినిమా రంగం ఓ వైకుంఠపాళి... 30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

సరదాగా కాసేపు నవ్వుకోండి..

వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## పెద్ద చెట్టు ప్రమాదంలో పడింది..!

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద చెట్టు ప్రమాదంలో పడిందంటున్నారు వుటా స్టేట్ యూనివర్సిటీ నిపుణులు. ఫిష్‌లేక్ నేషనల్ ఫారెస్ట్‌లో భాగంగా వంద ఎకరాల్లో ఉన్న పాండో ఓ ప్రత్యేకమైన ఉద్యానవనం. అక్కడ యాస్పెన్ జాతికి చెందిన సుమారు యాభై వేల చెట్లు కనిపిస్తాయి. అయితే చూడటానికి వేరు వేరు చెట్లలా కనిపించినా అవన్నీ ఒకే వేరు నుంచి ఏర్పడిన కాండం లేదా కొమ్మ లని గతంలోనే శాస్త్ర నిపుణులు నిర్ధారించారు. అందుకే దీన్ని అతి పెద్ద చెట్టుగా పేర్కొంటారు. అక్కడ ఉన్న ఒక్కో చెట్టు(కాండం) కనీసం వందేళ్లు జీవిస్తుంది. వాటన్నిటికీ మూలమైన వేరువ్యవస్థ మాత్రం లక్ష నుంచి పది లక్షల సంవత్సరాల క్రితం నాటిదని నిపుణులు భావిస్తున్నారు. అయితే ఇటీవల అక్కడి పర్యావరణ వ్యవస్థని మనుషులు, జంతువులూ కలిసి దెబ్బతీయడంతో ఆ చెట్లు వందేళ్ల కన్నా ముందే చనిపోతున్నాయట. మళ్లీ కొత్త పిలకలు వచ్చినా ఎక్కువ కాలం జీవించడం లేదు. అక్కడ నివసించే తోడేళ్లనీ, ఎలుగుబంట్లనీ వేటాడటంతో జింకలు, పశువుల జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరగడమే దీనికి కారణమనీ, అందుకే జీవావరణ వ్యవస్థలో వన్యప్రాణుల్ని వేటాడితే నష్టం మరో రూపంలో ఎదుర్కోవాల్సి ఉంటుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

## రోబోల వల్ల న్యుమోనియా తగ్గుతోందట?

కొవిడ్ తరువాత న్యుమోనియా మరణాల సంఖ్య పెరుగుతోంది. కారణం.. ఊపిరితిత్తుల్లోని ఇన్ఫెక్షన్‌ను తగ్గించే మందును ఇవ్వడం వైద్య నిపుణులకు కష్టంగా మారింది. అందువల్ల ఈ వ్యాధికి సరైన చికిత్స కోసం శాన్‌డీగోలని కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఆల్గే కణాలతో మైక్రోస్కోపిక్ రోబోలను రూపొందించారు. వీటిని మైక్రోబోట్స్‌గా పిలుస్తున్నారు. ఇవి ఊపిరితిత్తుల చుట్టూ తిరుగుతూ వాటిల్లో నింపిన యాంటీ బయోటిక్స్‌ను కొంచెం కొంచెంగా విడుదల చేస్తూ ఇన్ఫెక్షన్‌ను నూటికి నూరు శాతం తగ్గించాయట. ఊపిరితిత్తుల్లోని ఇన్ఫెక్షన్‌ను తగ్గించేందుకు ఇంజెక్షన్ రూపంలో ఇచ్చే మందుతో పోలిస్తే ఈ సరికొత్త మైక్రోబోట్స్‌లో వాడే మందు శాతం చాలా తక్కువ, ఇందులోని మందు మొత్తం నేరుగా ఊపిరితిత్తుల్లో పేరుకున్న వైరస్ లేదా బ్యాక్టీరియా మీద దాడి చేస్తుంది. ఇంజెక్షన్ రూపంలో యాంటీబయోటిక్స్‌ను ఇచ్చినా అందులో కొద్ది శాతం మాత్రమే ఊపిరితిత్తులకి చేరుతుంది. కనుక ఈ నూతన చికిత్స ఆశాజనకంగా ఉందని చెప్తున్నారు.









# చెక్క కార్లు

ఒకప్పుడు బొమ్మల రూపంలో మాత్రమే పిల్లల కార్లను ఇప్పుడు సరదాగా నడిపేలా తయారు చేస్తున్నారు. ఆడీ, బుగాటి లాంటి లగ్జరీ కార్లు సైతం వీటిల్లో చేరిపోయాయి. అసలు సంగతేమిటంటే ఈ కార్లన్నీ చెక్కతోనూ తయారవుతున్నాయి. చెక్క కార్లు అనగానే సరదాగా చూడటానికి అనుకుంటే కార్లో కాలేసినట్లే. వీటి పై భాగం, సీట్లు చెక్కతో తయారైనా ఇంజిన్, లైట్లు, హారన్, బుజ్జి డిక్కీ... ఒకటేమిటి సకల హంగులుంటాయి. ఫెరారి, బీఎండబ్ల్యూ, రోల్స్‌రాయిస్, బెంజ్, జీప్ లాంటి మోడల్స్ లభిస్తున్నాయి. ఇక మీదే ఆలస్యం!













# 'సంఘీ' భావం



## ప్రక్షాళనకు నోచుకోని విద్యారంగం

**మా**రుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు చోటు చేసుకోవడం లేదు. ప్రస్తుతం విద్యావ్యవస్థ నిరుద్యోగులుగా జీవనపోరాటం సాగించే పట్టభద్రులను మాత్రమే తయారుచేస్తోంది. చదువుకున్న విద్య పూర్తి స్థాయిలో భవిష్యత్తుకు ఉపయోగపడటం లేదు. ఇంకా దశాబ్దాల క్రితం నాటి సిలబస్‌లు, పాఠ్యాంశాలు, బోధనే కొనసాగుతోంది. కృత్రిమ మేథ, డిజిటలైజేషన్, యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక వంటి అనేక మార్పులు సమాజంలో చోటుచేసుకున్నాయి. దీనికి అనుగుణంగానే ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కూడా మార్పులు వచ్చాయి. గతంలో ఉన్న ఉద్యోగాలతో పోలిస్తే ఇవి పూర్తిగా భిన్నమైన రీతిలో ఉన్నాయి. చిన్నతనం నుంచి చదువుకున్న విద్యలో కొంత మేర మాత్రమే ప్రస్తుతం ఉపాధి రంగంలో ఉపయోగపడుతోంది. పట్టా పుచ్చుకుని బయటకు వచ్చిన వారు మళ్లీ ప్రత్యేక సాంకేతిక శిక్షణ తీసుకోవడం ద్వారా మాత్రమే ఈ ఉద్యోగాల పోటీకి సిద్ధపడాల్సిన అవసరం ఏర్పడింది. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటివి చదివిన వారు ప్రస్తుతం ఆధునిక సమాజంలో ఉద్యోగాల పోటీని తట్టుకోగలుగుతున్నారు. సైన్స్, ఆర్ట్స్, హిస్టరీ, కామర్స్ చదవిన విద్యార్థులు ఉద్యోగాల వేటలో వెనుకబడిపోతున్నారు. మరోపక్క విద్యారంగంలో సమస్యలు ఎన్నో ఉన్నాయి. వీటిని పరిష్కారం చేయాలన్న దిశగా ప్రభుత్వాలు ఆలోచనలు చేయడం లేదు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియమాకాలు ఎప్పటికప్పుడు చేయడం లేదు. దీనితో బోధించే సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండటం లేదు. ఇక ప్రాథమిక దశలో రేషనలైజేషన్ పేరుతో తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను మూసివేస్తున్నారు. నిరుపేదలు ఎక్కువగా వెళ్లే ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడంతో వారు విద్యకు దూరమై కూలీనాలీ చేసుకుని జీవనాన్ని నెట్టుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్ల వంటి కనీస వసతులు కూడా ఉండటం లేదు. హైస్కూలు స్థాయి నుంచే పూర్తిస్థాయిలో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలని అధ్యయనాలు, నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతం గ్రామాల్లో 70 శాతం పాఠశాలలకు కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేని పరిస్థితులు ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసినా బోధించే వారు లేరు. కేవలం పది నుంచి 15 శాతం మంది ఉపాధ్యాయులకు మాత్రమే కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది. కంప్యూటర్ విద్యాబోధన కోసం ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ ఇవ్వడం లేదు. దీనితో కంప్యూటర్లు, విద్యుత్ ఉన్న పాఠశాలల్లో కూడా ఆధునిక విద్యాబోధన జరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థల వైపు దృష్టి సారిస్తున్నారు. అక్కడ కూడా 8వ తరగతి వరకు కంప్యూటర్‌లో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడం లేదు. విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ఆయా సంస్థల యాజమాన్యాలు కంప్యూటర్ విద్య పేరుతో భారీ ఫీజులను వసూలు చేస్తున్నాయి. అయితే వీటిని అమలుచేసే సమయంలో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాబోధన కేవలం మూస ధోరణిలో ఉంటోంది. పాఠ్యాంశాలను వడపోత పెట్టడం మినహా వారికి ఇతర అంశాలపై ఏమాత్రం పరిజ్ఞానం లేకుండా పోతోంది. కేవలం మార్కులు ఎలా సాధించాలన్న అంశంపైనే ప్రాధాన్యత ఇస్తూ రోజుకు పది నుంచి 12 గంటల పాటు విద్యార్థులను వేధిస్తారు. దీనితో ఇక్కడ చదివిన విద్యార్థులు ఇతర అంశాలపై కనీస పరిజ్ఞానం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 15 సంవత్సరాలు విద్యాభ్యాసం పూర్తి చేసుకుని బయటకు వచ్చిన విద్యార్థులకు వెంటనే ఉద్యోగాలు లభించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయకపోవడం, చేసినా నామమాత్రంగా ఉండటంతో పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం లేదు. ఐటి రంగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకే పెద్దపీట వేస్తున్నారు. సాధారణ డిగ్రీలు సాధించిన వారు మరో రెండు సంవత్సరాలు ప్రత్యేక శిక్షణ పొందాల్సి వస్తోంది. కరోనా తరువాత పరిశ్రమలు, వ్యాపార సంస్థలు గణనీయంగా సిబ్బందిని తగ్గించి వేశాయి. ఐటి సంస్థలు వర్క్ ఫ్రం హోం విధానాన్ని అమలుచేయడంతో దానికి అనుబంధంగా ఉండే రంగాలు దెబ్బతిన్నాయి. ఐటి ఉద్యోగులు ఆఫీసులకు వెళితే రవాణా రంగం, హోటల్ వ్యవస్థ వంటివి ఎన్నో వ్యవస్థలకు పని ఉండేది. ఉద్యోగాల్లో ఎక్కువగా సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారికే ప్రాధాన్యత లభిస్తోంది. స్కిల్స్ లేకపోతే చిన్న ఉద్యోగాలు కూడా లభించడం లేదు. తాము చిన్నప్పటి నుంచి చదివిన విద్య అక్కరకు రాకపోవడంతో యువత నిరాశకు గురౌతోంది. పక్కదారుల ద్వారా ఆదాయాన్ని ఆర్జించాలన్న తపన యువతను పెడమార్గానికి తీసుకువెళుతోంది. దీనివల్ల సమాజానికి చేటు కలిగే ప్రమాదం ఉంది. వీటన్నిటికీ పరిష్కారం విద్యార్థి దశ పూర్తి చేసుకుని బయటకు వచ్చే సరికి ఏదో రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సముపార్జించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ దిశగా విద్యావ్యవస్థను మార్పుచేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత విద్యావ్యవస్థలో రావాల్సిన అనేక మార్పుల గురించి నివేదికలు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఇంజనీరింగ్ విద్యలో కూడా అనేక కొత్త కోర్సులను ప్రవేశపెట్టాల్సి ఉంది. మనదేశంలో విద్యకంటే విదేశాల్లో విద్యనభ్యసించిన వారికి ఎక్కువ ప్రాధాన్యత ఉన్నట్లు ప్రచారం జరగడంతో లక్షల రూపాయలు ఖర్చుచేసి తమ పిల్లలను విదేశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. దీనివల్ల మనదేశానికి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. ఉపాధి. కల్పన జరిగే విధంగా విద్యాబోధన కొనసాగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి, సమస్యలను పరిష్కరించినప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# వింతలకు నిలయం సహారా ఎడారి

**షేక్ అబ్దుల్ వాకీం జాని**

**ఆఫ్రికా** భూభాగంలోని మూడో వంతు ఆక్రమించుకుని ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారిగా సహారా ఎడారి భాసిల్లుతుంది. వాస్తవానికి ప్రపంచంలోని అతి పెద్ద ఎడారి అంటార్కిటికా ఖండంలో ఉందనేది కొందరి అభిప్రాయం. సహారా అంటే అరబిక్ భాషలో అతి పెద్ద ఎడారి అనే అర్థం వస్తుంది. ఈ ఎడారి విస్తీర్ణం 90 లక్షల చదరపు కిలోమీటర్లు. వైశాల్యంలో అమెరికా సంయుక్త రాష్ట్రమంత పెద్దది. ఆస్ట్రేలియా కంటే పెద్దది. మన భారతదేశం కంటే రెండు రెట్లు పెద్దది. ఒకవేళ సహారా కనుక దేశమైతే ప్రపంచంలో ఐదో పెద్ద దేశమయ్యేది. అంటే మన ఇండియాకు మూడింతలు పెద్దది. బ్రెజిల్ కన్నా పెద్దది. చైనాతో పోలిస్తే కాస్త చిన్నది. సహారా ఎడారి ఉత్తర ఆఫ్రికా ఖండంలో ఎర్ర సముద్రం నుండి మధ్యధరా సముద్రతీరం ప్రాంతం వరకు, అట్లాంటిక్ మహాసముద్రం పొలిమేర వరకు విస్తరించి ఉంది. సహారా ఎడారి ఆఫ్రికా ఖండంలో పది శాతం వరకు వ్యాపించి ఉండటంతో ప్రపంచంలో అతి పెద్ద ఎడారిగా ఖ్యాతినార్జించింది. అల్జీరియా, ఈజిప్ట్, చాద్, మాలి, లిబియా, మొరాకో, మౌరిటానియ, సుడాన్, నైజర్ మొదలైన పదకొండు దేశాలలో సహారా ఎడారి విస్తరించి ఉంది. అతి పెద్ద పిండిరాళ్ల కొండలు ఇసుకరేణువులుగా మారి సహారా ఎడారి ఏర్పడింది.

**ప్రకృతి దృశ్యాలు**

ఈ ఎడారి మొత్తం ఇసుక మాత్రమే ఆక్రమించదు. మధ్య మధ్యలో రాళ్లు, చిన్న చిన్న నీటి కొలనులు, భూకంపాల వల్ల ఏర్పడిన పర్వతాలు, అక్కడక్కడా పచ్చని ద్వీపాలు కూడా కనిపిస్తాయి. గాలి



తుఫానులు ఈ ఇసుకమేటలను ఏర్పరచినట్లు భావిస్తున్నారు. ఇసుకలో కలిసిపోయే విష సర్పాలు, మండ్రగబ్బలు, కలుగులో నివసించే ఎలుకలు కనిపిస్తాయి. సహారా ఎడారిలో అధిక భాగం అభివృద్ధి చెందని, విభిన్నమైన స్థలాకృతిని కలిగి ఉంది. ఇక్కడ ఇసుకదిబ్బలు, ఇసుక సముద్రాలు, బంజరు రాయి పీఠభూములు, కంకర మైదానాలు, పొడి లోయలు ఉన్నాయి. ఎడారిలో ఇసుకతిన్నెలు కొన్ని 180 మీటర్ల ఎత్తులో కూడా ఉంటాయి. ఇది వైవిధ్యమైన భౌగోళిక స్వరూపం కలిగి వుంది. ఈ భౌగోళిక స్వరూపంలో నైలు, సెనెగల్ వంటి నదులు కూడా ప్రవహిస్తున్నాయి. అయిర్, అహగ్గర్, సహారా అట్లాస్, టిబెట్సి వంటి పర్వత శ్రేణులు ఉన్నాయి. సహారా ఎడారిలోనే లిబియన్ ఎడారి టెనిరి, ఈజిప్షియన్ ఇసుకసముద్రం వంటి ఎడారులు ఉన్నాయి.

**వింతలకు నిలయం**

సహారా ఎడారి అనేక వింతలు, విశేషాలకు నిలయం. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఇది మైదాన ప్రాంతం కాదు. పలు రకాల ప్రాంతాలు ఇందులో కలిసి వున్నాయి. కొన్ని వేల సంవత్సరాల తరువాత ఈ మైదానం నశించి ఇలా ఎడారిగా మారి ఉండవచ్చు. కొన్ని మిలియన్ల సంవత్సరాల క్రితం ఇది సముద్రమని కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం.

భూమిలోపల ఏర్పడిన ప్రకంపనాల వల్ల సముద్రం ఇంకిపోయి భూమిపైకి వచ్చినట్లు భావిస్తున్నారు. మొరాకో దక్షిణ భాగంలో ఈ సముద్రపు జాడలు కనిపిస్తాయి. మిలియన్ల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతం అడవులకు ఆలవాలంగా ఉండటమే కాక ఉత్తర ఆఫ్రికాలోని డైనోసార్లకు స్థావరంగా విరాజిల్లింది. మొరాకో దక్షిణ భాగంలో మీటర్‌కు మించిన కాళ్లగుర్తులు కనిపిస్తాయి. రాతి యుగం సమయంలో నివసించిన ఈ ప్రాంత ప్రజలు ఏనుగులను, జిరాఫీల ను గొడ్డళ్లతో వేటాడేవారు. ఇక్కడి పర్వతా లతో పాటు కొన్ని ఆనవాళ్లను గమనిస్తే అనేక తెగలవారు ఈ ప్రాంతంలో జీవించిన దాఖలాలు కనిపిస్తాయి. సహారా ప్రాంతంలో ఉష్ణోగ్రత పెరిగిపోవడం వల్ల ఆకుపచ్చగా ఉండే ఇక్కడి మైదానాలు పొడి భూమిగా తయారై ఆ తరువాత ఎడారిగా మారింది. ఇప్పటికీ ఈ ఎడారిలో నీటిజాడలు ఉన్న ప్రాంతాలలో జంతుజా లం కానవస్తాయి. హిరణ్యాలు అనే పేరు గల జంతువులు, వేగంగా పరుగెత్తే ఇసుకచేపలు, బల్లులు మొదలైనవి పురు గుల్ని వేటాడుతూ కనిపిస్తాయి. దాదాపు వంద రకాల జంతుజాలాలు, 500 రకాల చెట్లు

ఇక్కడ కనిపిస్తాయి.

**అంతు చిక్కని కన్ను ఆకారం**

సహారా ఎడారి మధ్యలో 50 కి.మీ. వెడల్పు, 50 కి.మీ. పొడవుతో ఒక కన్ను ఆకారం గల ప్రదేశం ఉంది. కన్ను ఉండే భాగం ఒకప్పుడు అట్లాంటిక్ సిటీ అని ఇటీవల చేసిన పరిశోధనల ద్వారా తెలిసింది. దీన్ని ఎవరు, ఎప్పుడు, ఎందుకు నిర్మించారో ఇప్పటికీ అంతు చిక్కని సమాధానంగానే మిగిలింది. సహారా ఎడారిలో అంతా ఇసుక కాదు, ఈ ప్రాంతంలో భూగర్భ జలాశయాలను ప్రసాదించే అందమైన ఒయాసిస్‌ను కూడా మనం చూడవచ్చు. వాటిలో ముఖ్యమైనవి చాద్ వంటి సరస్సులు, అవబరి, బహారియా, గార్దయా ఒయాసిస్‌లు. సహారాలోని కొన్ని ప్రాంతాల్లో వంద మీటర్లకు ఒక చోట ఇసుక పొరలను తవ్వి, అతి కష్టం మీద భూగర్భ జలాలను వెలికితీసి, వంద చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యవసాయం చేసి పంటలు పండిస్తారు. అయితే సహారా దక్షిణ ప్రాంతంలో ఒక్కచోటే 2,500 కి.మీ. సాగుభూమి ఉంది. ఈ ప్రాంతంలో ఒంటెలు కూడా నివసిస్తూ ప్రజల అవసరాలు తీరుస్తుంటాయి.

**ఖనిజ లవణాలు**

భూగోళం చుట్టూ వీచే బలమైన గాలుల గురించి అవి అనేక వేల మైళ్ల దూరం నుంచి తెచ్చే దుమ్ము, ధూళి పరిమాణం గురించి ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రదేశాలలో అమెరికా శాస్త్రజ్ఞులు అంతరిక్ష రాకెట్లు, బెలూన్లు, ఓడలు మొదలైనవాటి సహాయంతో అధ్యయనం చేసి కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు కనుగొన్నారు. అనేక దేశాలపై గాలి ద్వారా సంవత్సరానికి కొన్ని మిలియన్ల టన్నుల సన్నటి ధూళి అనేక వేల మైళ్ల దూరంలో ఉన్న ఇతర ప్రాంతాలపై వెదజల్లుతు న్నది. దక్షిణ అమెరికాలో అమెజాన్ నది ప్రాంతం చుట్టూ కొన్ని మిలియన్ల చదరపు కిలోమీటర్లు వ్యాపించి వున్న దట్టమైన అరణ్యాలలోని చెట్లు, వృక్షాలు పెరగటానికి అవసరమైన మిలియన్ల టన్నుల ఖనిజ లవణాలు అట్లాంటిక్ సముద్రం అవతలి వైపు నుంచి ఆఫ్రికా ఖండం నుండి ఆకాశం ద్వారా గాలిలో వస్తాయని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అంతేకాక సహారా ఎడారి మధ్యలో వున్న చాద్ పేరు గల దేశం చుట్టూ వున్న పర్వత శ్రేణుల నుండి వచ్చే ఇసుక, దుమ్ము నుండి ముఖ్యంగా ఈ ఖనిజ లవణాలు అమెజాన్ అడవులపై పడుతుంటాయి. వృక్షాలు దట్టంగా పెరగటానికి తోడ్పడుతున్నాయి. ఈ విషయాలను అమెరికాలోని కొన్ని పరిశోధనా సంస్థలు అనేక సంవత్సరాల పాటు సేకరించిన సమాచారం ద్వారా తెలుసుకున్నారు.

నిప్పుల కొలిమిపై మంచుతివాచి

సహారా ఎడారి నిప్పుల కొలిమిలా ఉంటుంది. అయితే సహారా ఎడారిలో కేవలం ఉష్ణోగ్రత, వేడి మాత్రమే ఉంటుంది. అలాంటి చోట సైతం కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడు మంచు కురవడం విశేషం. ఇసుకతిన్నెలపై మంచు పేరుకుపోతోంది. నిప్పుల కొలిమిపై మంచు తివాచి పరచుకున్నట్లు నయనానందకర దృశ్యాలు కనిపిస్తాయి. ఇది ప్రకృతిలో కనిపిస్తున్న అద్భుతం అనుకోవచ్చు. అయిన్ సెఫ్రా పేరు మనం పెద్దగా వినం కానీ నిజానికి దీన్ని ఎడారి ద్వారంగా పిలుస్తారు. ఎందుకంటే యూరప్ దేశాలవారు స్పెయిన్ నుంచి





అల్జీరియాలోకి ప్రవేశించి సహారా ఎడారిలో అడుగు పెడతారు. ఈ మంచు సహారా అంతటా కురవదు. సముద్ర మట్టానికి వెయ్యి మీటర్ల ఎత్తు ఉన్న ప్రాంతంలో మాత్రమే కురుస్తోంది. అట్లాస్ పర్వతాలకు చుట్టూ పడుతోంది. ఎత్తయిన ప్రాంతాల్లో కార్బన్ డై ఆక్సైడ్ తక్కువగా ఉంటుంది. అందువల్ల వేడి తగ్గుతుంది. అక్కడ చల్లదనం పెరిగి మంచు కురవడం సహజం. ఎత్తులో ఉన్న అల్జీరియాలోని అయిన్ సెఫ్రాలో మంచు కురిసిన సమయాల్లో వాతావరణం చల్లబడుతుంది. కొన్ని ప్రాంతాలలో విపరీతంగా మంచు కురుస్తుంది. సహారా ఎడారి ప్రవేశ ద్వారంగా భావించే ఉత్తర అల్జీరియాలోని అయిన్ సెఫ్రాలో ఎర్రటి ఇసుకపైన తెల్లటి మంచు కురిసినప్పుడు ఈ ప్రాంత సౌందర్యం వర్ణనాతీతంగా కనిపిస్తుంది. ఇక్కడ అనేక పర్యాయాలు 16 అంగుళాల మందంతో మంచుపొరలు ఏర్పడటం విశేషం. అయిన్ సెఫ్రా ప్రాంతంలో గత 42 ఏళ్లలో పలుమార్లు మంచు కురిసింది. గతంలో 1979, 2016, 2018, 2021లో మంచు విపరీతంగా కురిసింది. సహారా ఉత్తర ప్రాంతానికి పైన మధ్యధరా సముద్రం ఉంటుంది. అక్కడి గాలిలో తేమ చాలా తక్కువ. రాత్రివేళ సహారా ఎడారి మొత్తం చల్లబడి 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. కొన్ని ప్రాంతాలలో ఏడాదికి 5 మి.మీ. కంటే తక్కువ వర్షం కురుస్తుంది.

అంతు పట్టని విధంగా సహారా ఎడారి పొడవు, వెడల్పులు తగ్గుతుంటాయని అంచనా. గ్లోబల్ వార్మ్ వల్ల ఇలా జరుగుతుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. సహారా ఎడారిలో 5,000 సంవత్సరాల పురాతనమైన శ్మశానంలో స్త్రీతో పాటు ఇద్దరు పిల్లలు అస్తికలు బయట పడ్డాయి. అక్కడ ఆమెను పూర్వ కాలంలో ఇద్దరు పిల్లలతో పాటు పూడ్చిపెట్టారని పరిశోధకుల అభిప్రాయం. దీన్నిబట్టి ఒకప్పుడు ఈ ప్రాంతంలో ప్రజలు జీవనం సాగించారనే విషయం అవగతమౌతుంది.

సహారాలో అతి పెద్ద రైలు

సహారా ఎడారిలో అతి పెద్ద రైల్వేను మారిటాన్ రైల్వే అని పిలుస్తారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారి రైలు. 1963లో అక్కడ ఉన్న జోరబ్ ఐరన్ మైన్ సమీపంలో సముద్ర తీరమైన నోడిబౌ ప్రాంతాన్ని అనుసంధానం

**(మిగతా 22వ పేజీలో)**





# జగమంతా వెలుగు దివ్వెలు

కవర్ స్టోరీ

ఎం.వెంకటేశ్వర రావు

భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీపాల దీపావళి. జాతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దీపావళి ఆనందంగా జరుపుకుంటారు.

నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు, అతని పీడ వదిలిన ఆనందంతో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలో రావణుడుని సంహరించిన శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని చేసుకున్నారని రామాయణం చెబుతోంది. చీకటిని పారదోలుతూ వెలుగులను తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా ప్రజలు దీపావళి పండుగను జరుపుకుంటారు. దీపాల కాంతుల శోభతో వెలుగొందే గృహాలంకరణలు ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే దీపావళి రోజున ఆబాలగోపాలం నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమ ఘుమలు, బాణాసంచా మోతలు, ఈ దివ్య దీపావళి సోయగాలు.

ఈ పండుగ ప్రతి యేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది.

దీపావళి పండుగకు ముందురోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి. దీనిని 'నరక చతుర్దశి' అంటారు. భారతదేశంలో సంస్కృతీ పరంగా హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు దీపావళి జరుపుకుంటారు. ఈ పండుగ రోజున దీపాలు, అలంకరణలు, కొత్తబట్టలు, టపాకాయలు, పూజలు, ప్రార్థనలు, మిఠాయిలు, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవటం సాంప్రదాయంగా భావిస్తారు.

## దీపాలంకరణ, లక్ష్మీపూజ

దీపం జ్యోతిః పరబ్రహ్మా దీపం సర్వతమోపహమ్ ।
దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీపం నమోస్తుతే ॥

దీపజ్యోతిని పరబ్రహ్మా స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, సంతోషానికి, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళలందరూ ఆశ్వయుజ బహుళ చతుర్దశి నుండి కార్తిక మాసమంతా మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగిస్తారు. చివరికి ఈ దీపాలను ముత్తయిదువులు కార్తిక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి ప్రతీకలుగా భావిస్తారు. దీపావళి శరదృతువులో రావటం విశేషం. మనో నిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలం ఇది. దీపాల పండుగ అయిన దీపావళి రోజున మహాలక్ష్మీ పూజలను జరుపుకోవడానికి ఓ ప్రత్యేకత ఉంది.

పూర్వం దూర్వాస మహర్షి ఒసారి దేవేంద్రుని ఆతిథ్యానికి సంతసించి, ఒక మహిమాన్వితమైన హారాన్ని ఇచ్చాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావంతో తన వద్దనున్న ఐరావతం మెడలో వేస్తాడు. అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది. అది చూసిన దూర్వాసుడు ఆగ్రహం చెంది దేవేంద్రుని శపిస్తాడు. ఫలితంగా దేవేంద్రుడు రాజ్యాన్ని, సర్వసంపదలను కోల్పోతాడు. చివరికి శ్రీహరిని ప్రార్థిస్తాడు. శ్రీహరి ఇంద్రుని పరిస్థితి గమనించి ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీ మహాలక్ష్మి స్వరూపంగా భావించి పూజించమని సూచిస్తాడు. దానికి తృప్తి చెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో ఇంద్రుడు తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సకల సంపదలను పొందాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ సమయంలో శ్రీహరి చెంతనే ఉండే మహాలక్ష్మి దేవిని ఇంద్రుడు ఇలా ప్రశ్నించాడు. "తల్లీ! నీవు కేవలం శ్రీహరి వద్దనే ఉండటం న్యాయమా? నీ భక్తులను కరుణించవా?" అంటాడు. దానికి లక్ష్మీదేవి "త్రిలోకాధిపతీ! నన్ను త్రికరణశుద్ధిగా ఆరాధించే భక్తులకు వారి అభీష్టాలకు అనుగుణంగా మహర్షులకు మోక్షలక్ష్మిగా, విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మిగా ఐశ్వర్యాన్ని కోరేవారికి ధనలక్ష్మిగా, వారి సమస్త కోరికలు నెరవేర్చే వరలక్ష్మిగా, విద్యార్థులలక్ష్మిగా ప్రసన్నురాలిని అవుతానని" బదులిచ్చింది.
అందుచేత దీపావళి రోజున శ్రీమహాలక్ష్మిని పూజించే వారికి సర్వసంపదలు సమకూరుతాయని ప్రజలు భక్తి విశ్వాసాలతో కొలుస్తారు.

### నరక చతుర్దశి

ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరక చతుర్దశిగా ప్రసిద్ధి పొందింది. నరకాసురుడనే రాక్షసుడు చెలరేగి ప్రజలను, సాధుజనాలను పీడిస్తూ దేవ, మర్త్యలోకాలలో సంక్షోభం కలిగిస్తుంటాడు. కృత యుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామికి, భూదేవికి అసుర సంధ్యా సమయంలో నరకుడు జన్మిస్తాడు. ఇతడు లోక కంటకుడైనా మహావిష్ణువు ఇతడిని వధించరాదని తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా అవతరించినపుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది. అప్పటికి నరకాసురుడు చేస్తున్న అకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలివెళ్తాడు శ్రీకృష్ణుడు. వారి మధ్య జరిగిన భీకర సంగ్రామంలో సత్యభామ శరాఘాతాలకు నరకుడు మరణిస్తాడు. తన పుత్రుని పేరు కలకాలం నిలిచి వుండేలా చేయమని సత్యభామ ప్రార్థించగా, ఆ రోజు నరకచతుర్దశిగా పిలవబడుతుందని అనుగ్రహిస్తాడు కృష్ణుడు. నరకుని చెర నుండి సాధుజనులు, పదహారు వేల మంది రాజకన్యలు విడుదలయ్యారు. అందుకే ధర్మం సుప్రతిష్ఠమైంది.
నరకాసురుని పీడ విరగడైనందున సంతోషంలో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకునే పండుగే దీపావళి. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమావాస్య కావడంతో చీకటి పారదోలుతూ ప్రజలు దీపాల తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే 'దీపావళి పర్వదినంగా' మారింది.



### సత్యం-శివం-సుందరం

పంచభూతాలలో ప్రధానమైనది అగ్ని. ఈ అగ్ని ప్రాణికోటి మనుగడకు ఉపయోగించే తేజస్సును, ఆహారాన్ని ఐహికంగాను, విజ్ఞాన ధర్మ గరిమను ఆధ్యాత్మికంగాను ప్రసాదిస్తుంది. దీపాలను వెలిగించడం ద్వారా మూడు రంగులు ప్రధానంగా మనకు గోచరమవుతాయి. నీలం, పసుపు, తెలుపు. ఈ మూడు రంగులు మానవ మనుగడకు ఆవశ్యకమైన సత్వ, రజ, స్తమో గుణాల సమ్మేళనంగా ఆర్యులు చెబుతుంటారు. ఈ మూడు రంగులను జగతిని పాలించే లక్ష్మి, సరస్వతి, దుర్గలుగా భావించారు పౌరాణికులు. అంతేకాక సత్యం-శివ-సుందరం.. అవి దీప ప్రజ్వలన ద్వారా త్రిజగన్మాతలను ఆరాధించినట్లుగా, మానవులకు విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతమని భారతీయులు భావిస్తారు.

### దివ్వి దివ్వి (వెలుగు) దీపావళి

"దివ్వి దివ్వి దీపావళి మళ్లీ వచ్చే నాగుల చవితి అంటూ" చిన్న పిల్లలంతా గోగునార కట్టలకి చిన్న చిన్న గుడ్డముక్కల్ని కట్టి వెలిగించి దిష్టి తీయడాన్ని మనం సంప్రదాయంగా కొన్ని ప్రాంతాలలో చూస్తుంటాం. సాయంత్రం ప్రదోష సమయంలో దీపాలు వెలిగిస్తారు. ఈ దీపం పితృదేవతలకు దారి చూపుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ తర్వాత బాణాసంచా కాల్చడానికి సన్నద్ధమవుతారు.

### బాణాసంచా

దీపావళి రోజున కాల్చే బాణాసంచాలో చిచ్చుబిడ్లు, విష్ణుచక్రాలు, భూచక్రాలు, మతాబులు, కాకరపువ్వొత్తులు, సీమ టపాకాయలు, బాంబులు, తాటాకు టపాకాయలు, ఔట్లు, వెన్నుముద్దలు, లడీలు.. ఇలా రకరకాలుగా కళ్లు మిరుమిట్లు గొలిపే రంగు రంగుల కాంతులతో ధమ ధమ ధ్వనులతో మోగుతుంటాయి. బాణాసంచా కాల్చడానికి ప్రయోజనం ఉందని పురాణాలలో చెప్పబడింది. బాణాసంచా వెలుగుల్లో శబ్దతరంగాలలో దారిద్ర్య దుఃఖాలు దూరంగా తరిమివేయబడతాయని, లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని, అంతేకాకుండా వర్ష రుతువులో ఏర్పడ్డ తేమ వలన పుట్టుకొచ్చే క్రిమికీటకాలు బాణాసంచా పొగలకి నశిస్తాయని ప్రతీతి.

భగినీ హస్త భోజనం

దీపావళి పండుగను కొన్ని ప్రాంతాల్లో అయిదు రోజులు జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు, కార్తిక విదియ భగినీ హస్త భోజనంతో ముగుస్తాయి. సోదరీ సోదర ప్రేమకు చిహ్నంగా రాఖీ పండుగ తర్వాత భగినీ హస్త భోజనం విశిష్టమైనది.
దీపావళి వెళ్లిన రెండో రోజు ఈ పండుగ జరుపుకుంటారు. అన్నదమ్ములు తమ అక్కచెల్లెళ్ల ఇళ్లకు వెళ్లి, వారి చేతి భోజనం తిని, వారి చేత తిలకం దిద్దించుకుంటారు. భగినీ అంటే అక్క లేదా చెల్లెలు. కార్తిక శుద్ధ విదియనాడు వివాహమైన సోదరి ఇంట భోజనం చెయ్యాలని శాస్త్రాలు చెబుతున్నాయి.
పురాణ కథ ప్రకారం- సూర్యభగవానునికి, సంధ్యకు పుట్టిన సంతానం యముడు, యమున. వీరికి ఒకరంటే ఒకరికి ఎంతో ఇష్టం. యమునకు వివాహం జరిగి కాపురానికి వెళ్లింది. ఓసారి అన్నను చూడాలని యముడికి వర్తమానం పంపింది. అన్నకు ఇష్టమైన పదార్థాలన్నీ చేసి, అన్న రాకకోసం ఎదురు చూస్తోంది. యముడు రాలేదు. రాలేనని కార్తిక శుద్ధ

విదియనాడు విందుకు వస్తానని వర్తమానం పంపాడు.

యమున సంతోషించింది.

మాట ఇచ్చిన ప్రకారం కార్తిక శుద్ధ విదియనాడు యముడు వచ్చాడు. యమున ఆనందపడి అన్నయ్య నుదిటిన తిలకం దిద్ది, పూలమాల వేసి, సంతృప్తిగా అన్నకు భోజనం పెట్టింది.

చెల్లెలి ప్రేమకు సంతసించి "నీకేం వరం కావాలో కోరుకోమని" అడిగాడు.

ప్రతి సంవత్సరం కార్తిక శుద్ధ విదియ రోజున భోజనానికి రావాలని, తనే కాకుండా ఆ రోజున ప్రతి సోదరుడు తన సోదరి చేతి వంట తినాలని" అడుగుతుంది.

తన అన్నదమ్ములు సుఖ సంతోషాలతో ఉండాలని, అక్కాచెల్లెళ్ల పసుపు-కుంకుమలతో ఆనందంగా ఉండాలని సోదరులు కాంక్షించే పండుగ ఇది.

### హరిత దీపావళి

దీపావళి పండుగ తొలినాళ్లలో పూజా పునస్కారాలు చేయడం, దీపాలు వెలిగించడం, బంధుమిత్రులతో కలసి విందుభోజనం ఆరగించటం వరకు మాత్రమే పరిమితమై ఉండేది. 14వ శతాబ్దం వరకూ దీపావళి రోజున బాణాసంచా ప్రస్తావన ఎక్కడా కన్పించదు. రచనలలో దీపాలు, విందు-వినోదాలు, నృత్య గానాది సాంస్కృతిక కార్యక్రమాల వర్ణనే కన్పిస్తుంది.

### బాణా సంచా చరిత్ర

సూరేకారంగా జన సామాన్యం పిలిచే పొటాషియం నైట్రేట్‌ను కనుగొన్న తర్వాత దీపావళి జరుపుకునే తీరు మారింది.

క్రీ.శ.960-1279 కాలంలో చైనీయులు సూరేకారం, గంధకంపొడి, బొగ్గుపొడి కలిపి గన్‌పౌడర్‌ను తయారు చేశారు.

మంట అంటుకోగానే భారీ శబ్దంతో ఇది పేలుతుంది. తర్వాత కాలంలో ఈ గన్‌పౌడర్‌ను యుద్ధాల్లో వాడే ఫిరంగుల్లో వాడటం మొదలైంది. కాలక్రమంలో వివిధ ప్రయోగాల ద్వారా రకరకాల బాణాసంచా తయారీ ప్రారంభమైంది. గన్‌పౌడర్ మిశ్రమాన్ని వివిధ పాళ్లలో కలిపి తక్కువ పేలుడు కల్గించేవి, వివిధ రంగులు విరజిమ్మేవి ప్రారంభమయ్యాయి.

భారతదేశానికి 14వ శతాబ్దిలో బాణాసంచా తయారీ అయినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

బాణా సంచా తయారీ కేంద్రాలు స్వాతంత్ర్యానికి ముందు కలకత్తాలో బాణాసంచా తయారీ జరిగేది. స్వాతంత్ర్యం తర్వాత తమిళనాడులోని శివకాశి ప్రధాన కేంద్రంగా మారింది. మన దేశంలో ఇప్పటికీ భారీగా బాణాసంచా తయారీ శివకాశిలోనే జరుగుతోంది.

### నిషేధాలు

కొందరు పర్యావరణవేత్తలు బాణాసంచా కాల్చడం వల్ల ప్రమాదాలే కాకుండా పర్యావరణ కాలుష్యం అవుతోందని సుప్రీంకోర్టులో కేసు వేశారు. 2018 సంవత్సరంలో భారత సుప్రీంకోర్టు బాణాసంచా వినియోగంపై ఆంక్షలు విధించింది. రెండు గంటలు మించి బాణాసంచా కాల్చరాదని సుప్రీంకోర్టు తెల్పి చెప్పింది. దానికి బదులుగా పర్యావరణానికి



హాని చెయ్యని బాణాసంచాకు అనుమతి ఇచ్చింది. కానీ పర్యావరణవేత్తలు బాణాసంచా పూర్తిగా నిషేధించాలని కోర్టును ఆశ్రయించినా ఫలితం లభించలేదు. బాణాసంచా విషయంలో ప్రజలు స్వచ్ఛంధంగా, కోర్టు ఆజ్ఞలను అమలు చెయ్యడం, వాడకం తగ్గించారు.

### గ్రీన్ క్రాకర్స్

గ్రీన్ క్రాకర్స్‌ను ప్రభుత్వ రంగానికి చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్) శాస్త్రవేత్తలు రూపకల్పన చేశారు. ఇప్పటికే దేశంలో 165 బాణాసంచా తయారీ సంస్థలు బాణాసంచా ఉత్పత్తిని ఆరంభించాయి. సాధారణ బాణాసంచాకంటే గ్రీన్ క్రాకర్స్ 30-35 శాతం తక్కువ పార్టిక్యులేట్ మేటర్ ఉద్గారాలను, 35-40 శాతం తక్కువ ఇస్తాయి.

### వాయు కాలుష్యం

బాణాసంచా కాల్పుల్లో వెలువడే పొగలో సీసం, రాగి, మెగ్నీషియం, జింక్, మాంగనీసు, సోడియం, పొటాషియం, బేరియం, అల్యూమినియం, కాడ్మియం, పాస్పరస్ వంటి పదార్థాలుంటాయి. ఇవి జ్వరం, వణుకు, కండరాల బలహీనత, నీరసం, దురదలు, ఎముకల పెళుసుతనం, కాలేయం, కిడ్నీ, పక్షవాతం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. బాణాసంచా పొగ వలన ఎక్కువగా పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడతారు. దీపావళి తర్వాత భారత్‌లో వాయు కాలుష్యం 50 శాతం పెరుగుతున్నట్ల శాస్త్రవేత్తల అంచనా.

### శబ్ద కాలుష్యం

భారీ శబ్దాలు చేసే బాణాసంచా పేలుళ్ళ వల్ల గుండెదడ, నిద్రలేమి, మానసిక ఆందోళన వంటి సమస్యలు వస్తున్నాయి. పెంపుడు జంతువులు ఆందోళన చెంది అస్తిమితమవుతున్నాయి. ఈ శబ్దాలకు పక్షులు మరణించే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

### నీటి కాలుష్యం

బాణాసంచా తయారీలో విపరీతంగా ఉపయోగించే పెర్క్లోరేట్ రసాయనాలు నీళ్లలో కరిగి నదులను, సరస్సులను కాలుష్య కూపాలుగా మారుస్తున్నాయి. తాగునీరు. సాగునీరు కలుషితమవుతున్నాయి.

### మార్కెట్లలో సందడి

దీపావళి వస్తోందంటే మార్కెట్లన్నీ క్రాకర్స్‌తో కళకళలాడుతుంటాయి. క్రాకర్స్ వ్యాపారం అతి పెద్ద వ్యాపారం.

దీపావళి సందడిని వ్యాపారంగా మార్చుకొనేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త పేర్లతో క్రాకర్స్ తయారు చేస్తున్నారు. భారత్‌లో పొటాషియం నైట్రేట్ ఉపయోగించి బాణాసంచా తయారు చేస్తారు. దీనివల్ల ప్రమాదాలు తక్కువ. పొటాషియం క్లోరైడ్‌తో తయారయ్యే బాణాసంచా ప్రమాదకరం. మార్కెట్లో లభ్యమయ్యే క్రాకర్స్‌తో పెప్సీ, థమ్స్ అప్, మిరిండా వంటి కూల్‌డ్రింక్స్ పేర్లతో, కుల్ఫీ, వెనిలా వంటి ఐస్‌క్రీంల పేర్లతో, వాట్సప్, ఫేస్‌బుక్, గూగుల, యుట్యూబ్ వంటి సోషల్ మీడియా పేర్లతో వైఫై, ఒడా ఫోన్, జియో ఫోన్, రైల్వే ట్రాక్ వంటి పేర్లతో, ఐమాక్స్, యూనివర్సల్, శాటిలైట్, రాకెట్ వంటి వెరైటీ పేర్లతో ఆకర్షిస్తున్నాయి. చైనాలో తయారయ్యే బాణాసంచా ప్రమాదకరమని, కిందపడ్డా పేలతాయని గుర్తించారు. ధర తక్కువ వున్న చైనా క్రాకర్స్ ప్రమాదంగా భావిస్తున్నారు. గ్రీన్ క్రాకర్స్ వల్ల కాలుష్యం, ప్రమాదాలు తక్కువని, పరిశోధనల అనంతరం ప్రభుత్వాలే వీటిని తయారు చేస్తున్నాయి. అంతేకాకుండా గ్రీన్ క్రాకర్స్‌కి కేంద్ర ప్రభుత్వ లోగో ఉండటం విశేషం, ఇప్పుడు మార్కెట్లో విత్తనాలతో తయారు చేసిన

క్రాకర్స్ లభ్యమవుతున్నాయి. ఇవి పేలిన తర్వాత నుండి వెలువడిన విత్తనాలు నేలపై పడి మొలకెత్తుతాయని తయారీదారులు ప్రచారం చేస్తున్నారు.

దీపావళి ముందు.. దీపావళి తర్వాత!

దీపావళికి బాణాసంచా కాల్చడం వల్లనే వాయు కాలుష్యం పెరిగిపోతోందని, ప్రమాదాలు సంభవిస్తున్నాయని, పర్యావరణవేత్తలు ఆరోపిస్తున్నారు. దీనిపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు కేవలం ఒక్కరోజు పేల్చిన బాణాసంచా వల్లనే వాయు కాలుష్యం పెరిగిందనడానికి ఆధారాలు లేవని వాదిస్తున్నారు. అలాగే వైద్యులు కూడా స్పందించి బాణాసంచా శబ్దాల వల్లనే ప్రజలు అనారోగ్యం పాలవడం చాలా తక్కువని చెబుతున్నారు. కాలుష్యానికి కారణం బాణా సంచా కాలుష్యమే ప్రధానమని చెప్పలేమంటున్నారు.

**బాణాసంచా తయారీ కర్మాగారాల్లో ప్రమాదాలు**

భారతదేశంలో బాణాసంచా తయారీ ప్రధాన కేంద్రమైన శివకాశి తమిళనాడులోని విరుదునగర్ జిల్లాలో మదురైకి 74 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ దేశంలో 70 శాతం అగ్గిపెట్టెలు, బాణాసంచా ఇక్కడే తయారు చేస్తారు. బాణాసంచా, ప్రింటింగ్, అగ్గిపెట్టెల పరిశ్రమలలో దాదాపు 7 లక్షల మందికి పైగా ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. విరుదునగర్ జిల్లాలోనే 1010 ఫైర్ క్రాకర్స్ యూనిట్లు ఉన్నాయి. బాణాసంచా తయారీ పరిశ్రమల్లో సరైన నిబంధనలు పాటించకపోవటం, పేలుడు పదార్థాల నిర్వహణలో కార్మికులకు సరైన శిక్షణ ఇవ్వకపోవడం, అనుమతులకు మించి రసాయనాలు నిల్వ ఉంచటంవల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి.

గత మూడేళ్లలో ఒక్క విరుదునగర్ జిల్లాలోనే బాణాసంచా పరిశ్రమల్లో 70-75 ప్రమాదాలు జరిగాయి. కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, గాయాల పాలవడం, అవయవాలు కోల్పోవడం, వినికిడి లోపం పాలవుతున్నారు. ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న పేద కార్మికులు ప్రమాదాల పాలైనా ఎక్కడికీ వెళ్లలేక వైకల్యంతోనే పనిచేసేవాళ్లు ఎంతో మంది ఉన్నారు. బాణాసంచా తయారు చేసే పరిశ్రమలకు లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలి. కొంత మంది లైసెన్సులు లేకుండా, నిబంధనలను ఉల్లంఘిస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

**ప్రమాద బాధితులకు సహాయం**

బాణాసంచా కర్మాగారాల్లో సంభవించే ప్రమాదాల్లో ప్రమాద బాధితులకు, ప్రమాదాలలో గాయపడిన వారికి కూడా నష్టపరిహారం అందించడానికి తమిళనాడు ప్రభుత్వం ఇటీవల 'ప్రత్యేక బాణాసంచా సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేసింది. శివకాశి బాణాసంచా పరిశ్రమల మధ్య పని చేస్తున్న ప్రభుత్వేతర సంస్థ హాల్యామన్ రిసోర్సెస్ ఫౌండేషన్(హెచ్ఆర్ఎఫ్) కార్మికులలో ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులను నిర్వహిస్తోంది. గ్రీన్ బాణాసంచా సంస్కృతిని పెంపొందించడంతో పాటు, ప్రమాదాలను నివారించడానికి తయారీలో ఉపయోగించే రసాయనాలపై సరైన శిక్షణ, పరిజ్ఞానం అవసరం గుర్తించి కార్మికులకు అవగాహన కల్పిస్తోంది.

ప్రమాదాల ప్రభావం, కార్మికుల పేద జీవన స్థితిగతుల అంశంపై అధ్యయనం చేసిన ప్రభుత్వేతర సంస్థలు, సామాజిక సంస్థల



జోక్యంతో గత కొన్నేళ్లుగా పరిస్థితులు మారాయని కార్మికులు అంటున్నారు. ప్రమాదాలకు గురైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నష్టపరిహారం, వైద్య ఖర్చులకు సహాయం చేస్తున్నారు. కార్మికులకు ఫైర్ సేఫ్టీపై కోర్సులు నిర్వహిస్తున్నారు.

**యంత్రీకరణ**

బాణాసంచా తయారీలో ప్రమాదాల నివారణ కోసం కొత్తగా యంత్రాలు వస్తున్నాయి. ఉత్పాదక ప్రక్రియను యాంత్రికంగా మార్చడం, ముఖ్యంగా రసాయనాల మిక్సింగ్, ఫిల్లింగ్, గుళికల తయారీలో యంత్రాల ద్వారా ఉత్పాదన జరుగుతోంది. మిక్సింగ్, ఫిల్లింగ్ దశల్లోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి.

**చివరిగా..**

దీపావళి అంటే కాంతులమయం. ఈ పర్వదినం రోజున ప్రతి ఇల్లు దీపకాంతులతో ప్రకాశిస్తుంది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ టపాసులు కాలుస్తూ ఆనందిస్తుంటారు.

➡ దీపావళి బాణాసంచా వెలుగు నింపాలిగానీ కాలుష్యాన్ని కాదు. తక్కువ శబ్దం, కాలుష్యం ఉండే ఎకోఫ్రెండ్లీ, గ్రీన్ క్రాకర్స్‌ని వినియోగించాలి. పర్యావరణ హిత బాణాసంచా అందుబాట్లోకి వచ్చాయి. కాలుష్య ఉద్గారాలను తగ్గించే మెంతి బాంబ్, రాడిష్ రాకెట్, మిరపకాయ బాంబ్‌ల వంటి గ్రీన్ క్రాకర్స్ వాడదాం.

➡ పిల్లలు, పెద్దలు బాణా సంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలి. దేశవ్యాప్తంగా దీపావళి రోజున ఎనిమిది వేల మంది ప్రమాదాల బారిన పడుతున్నారని, రెండు వేల మంది చూపు కోల్పోతున్నారని సర్వేలు చెప్తున్నాయి.

➡ టపాసులు కాల్చేటపుడు కళ్లజోడు ధరించాలి. బాణాసంచా ఇళ్ల మధ్య కాకుండా విశాలమైన ప్రత్యేక ప్రదేశాల్లో కాల్చాలి.

➡ పొగవల్ల శ్వాసకోశ, గుండెజబ్బుల బారిన పడకుండా మాస్కులు ధరించాలి. పండగ జ్ఞాపకంలా ఉండాలి కానీ ప్రమాదంగా మారకూడదు.

➡ పిల్లలు, యువత అత్యుత్సాహం చూపడమే ప్రమాదాలకు కారణం.

➡ అనుమతి పొందిన దుకాణాల్లోనే బాణాసంచా కొనుగోలు చెయ్యాలి. బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.

➡ ఎక్కువ కాలుష్యానికి ప్రమాదాలకు కారణమవుతున్న చైనా బాణాసంచాను నిషేధించాలి.

➡ పిల్లల్ని ఒంటరిగా క్రాకర్స్ కాల్చడానికి అనుమతించకండి.

➡ కళ్లు, ఒళ్లు, చెవులు.. ప్రమాదం బారిన పడకుండా బాణాసంచా కాల్చండి. కంట్లో ఏదైనా పటాసుల మలినాలు పడితే వెంటనే నీటితో కడగండి. ఎక్కువ స్థాయిలో ఉంటే డాక్టర్ని సంప్రదించండి.

➡ శబ్ద, వాయు, ధ్వని కాలుష్యాలు తక్కువగా ఉండే బాణాసంచా కాల్చండి. ప్రకృతిని, పర్యావరణాలు పాడవకుండా దీపావళి జరుపుకుందాం.

దీపకాంతుల దివ్య దీపావళిని భద్ర భరిత భవ్య దీపావళిగా జరుపుకుందాం.

❑





# ఎందుకో..!

కొందరు
ఎందుకో
అదృష్టవంతులు
కొందరు ప్రేమకు
బదులు
ప్రేమను అందుకున్నారు

నేను పూలహారం కావాలనుకున్నాను
ముళ్లహారం నా మెడను అలంకరించింది.
సుఖాల తీరం చేరాలనుకున్నాను
దుఃఖపు అలలు ముంచేసాయని తెలుసుకున్నాను.
ప్రేమగీతం ఆలపించాలనుకున్నాను
విరహం నన్ను చుట్టుముట్టిందని తెలుసుకున్నాను
మనసుభారం ఇంకా పెరిగిందని తెలుసుకున్నాను.
ప్రేమ నిండిన హృదయాన్ని అందుకోవడానికి
నిజానికి ఎవరి దగ్గర సమయం ఉంది
కొందరు సగం దూరం మాత్రమే నాతో
పయనించారు
నా నీడ కూడా నాతో రానంటోంది.
దీనినే జీవితం అంటారా..
ఇలాగే జీవించమని శాసిస్తారా
నేనెవరినీ నిందించడం లేదు
నా కన్నీటిని నేనే తాగుతున్నాను.
బాధ అంటే భయం వేయడం లేదు
వందసార్లు వెయ్యి సార్లు/ బాధను భరిస్తున్నా
ముళ్లు గుచ్చుతూనే ఉన్నాయి
ముళ్లు బాధను పెంచుతున్నాయి
ముళ్లహారం నా మెడను అలంకరించింది.

**- అరుణ డేనియల్**

---

## ప్రజల పక్షమై

## సాగించు పయనము

నిత్యం నీ గొంతు
ప్రజా సమస్యలపై వినిపించు
అనునిత్యం నీ సేవ
ప్రజల కొరకే సాగించు.
సత్యాన్ని ఎత్తుకొని
సమాజాన్ని మేల్కొలుపు
అసత్యం వీడనాడి
అడుగులో అడుగు కలుపు.
శాస్త్రాన్ని తెలుసుకొని
సాగించు పయనము
మూఢత్వాన్ని వదులుకొని
మేధస్సును పెంచుకొనుము.
అక్షరాస్యుల నిలదీసి
అజ్ఞానం తొలగించుము
నిరక్షరాస్యులను కలిసి
నిజాన్ని తెలుపుతుండుము.
నిద్రావస్థలో వుంటేను
నిమ్మళంగా తెలుపుము
ప్రధాన ఎజెండాను
పదిలంగా ఎరుకచేయుము.
సమరమందు దూకించి
సమరశంఖం పూరించుము.
సమస్యలను పరిష్కరించి
సమసమాజాన్ని నిర్మించుము.

**- పసుల శంకర్**

---

ఈ వారం కవిత్వం

# అదే వర్షం



వేకువల్లే
వేయి కలలు వెలిగించుకుని
తూరుపు కాంతులు పూసుకుని
చూపులు మార్చుకున్న రోజులు
కళ్లపై వాలుతున్నాయ్.
హాయిని గొలిపే ప్రపంచమంటే
కళ్లలో వెలిగే దీపాలు
దారి చూపటం..
మనసున ఊగే భావాలు
ఊరించటం
అలరించటం అంతే కదా..
వర్షాల ఊయల్లో
అలా ఊగిపోవటం
బంధాల్ని
ముడిపెట్టుకోవటం
కదూ..
ఇంతలా
వెన్నెల ఆకాశాన్ని
వొంచి
తల
నిమురుతుంటేనూ..
లోలోపల
జ్ఞాపకాలు
తడుముతుంటేనూ...
ఏదో వెన్నెల వాకిలి
వొలికి చిలికి
నీ ప్రపంచాన్ని
తెరలు తీసి
ప్రదర్శిస్తుంటేనూ
అదే వర్షం.
నాపై వాలే చినుకుల్లో
నీ జ్ఞాపకాలు తడుపుతున్నాయి.
వాస్తవానికి జ్ఞాపకానికి
ఒక తీయని ఊహా లోకంలో
కొత్త ప్రపంచాన్ని
కళ్లలో నిర్మిస్తాను.
అర్థమౌతోందా
జీవితమంటే కన్నీళ్లే కాదు..
కొన్ని కౌగిలించే జ్ఞాపకాలు కూడా.

**- గవిడి శ్రీనివాస్**

# పుస్తక సమీక్ష


## ‘Mr. వింత మనస్తత్వం కథలు’



తన అమ్మనాన్నలకు ఈ కథాసంపుటి అంకితం చేసారు సరసి ముందేమందు? అంటూ చక్కని ముందుమాట రాసారు. దాదాపు 26 కథలున్నాయి ఈ సంపుటిలో..సోలు సంభాషణ వల్ల టైలర్ హెచ్చుబిల్లు వేసిన వైనం ‘బోనస్ చిరునవ్వులు’ కథలో హాస్యంగా చెప్పారు రచయిత. టీ.వీ.వాళ్లు మగాళ్లకు పెట్టిన వంటలపోటికి గంగాధర్‌ను అతని (సరోజ) భార్య సిద్ధం చేయడం..ఎదో చేయబోతే మరేదో అవ్వడం దానికి ‘వేడావపులుస్’ అని పేరు పెట్టడం..హాస్యభరితంగా చెప్పారు రచయిత. ‘పిప్పి పన్ను పాపారావు’ కథలో పిప్పిపన్ను పీకడానికి పాతికవేలు అయ్యే ఖర్చు చూసి బెంబేలెత్తే పాపారావు కథ హాస్యంగా రాసారు. ఆఫీసును క్రమశిక్షణలో పెట్టడానికి నందిని లాంటి మహిళను హెడ్డాఫీసు వారు ఎలా ప్రయోగించారో చెప్పిన కథ ‘ఆయుధం’. తెగిన చెప్పుకు పిన్నీసు పెట్టుకొనే ‘Mr. వింత మనస్తత్వం’ గల మధ్యతరగతి జీవి పినాసి మనస్తత్వాన్ని హాస్యభరితంగా చెప్పిన కథే ‘శీర్షిక’ కథ. టీ.వి.లో వచ్చే ‘అడ్వర్‌టయిజ్మెంట్ ఒక బలహీనత’ అంశంపై రాసిన కథలో కొత్తకోడలు రాగిణి టి.వీ చూడటం అడ్వర్‌టయిజ్మెంట్‌లో చూడటం చివరకు తనకు పుట్టిన పిల్లాడూ టి.వీ.దాన్లోని అడ్వర్‌టయిజ్మెంట్‌మెంట్ చూడటం కరెంట్ పోతే ఏడ్చే పిల్లాడి కోసం ‘ఇన్వర్టర్’ కొన్న రాగిణి తండ్రి అల్లునికి పరిస్థితులు వివరించడం రాగిణి భర్త హాస్పటల్ పాలు కావడంతో కథలు ముగు స్తుంది.

**(Mr..వింత మనస్తత్వం, రచన: ప్రతాప వెంకట సుబ్బారాయుడు, వెల: రూ 199, ప్రతులకు: బి-40, రోడ్డు నం.4, జెజెనగర్, సైనిక్‌పురి, సికింద్రాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**


## ‘రమణీ’యమైన హాస్యకథలు



‘మనసుకు ఆహ్లాదం కలిగినపుడు ముఖంలో ప్రదర్శిత మయ్యే ఒక చేష్టయే నవ్వు ఈ సృష్టిలో నవ్వగలిగేది నవ్వించగలిగేది మనిషి మాత్రమే! నవ్వినపుడు మన శరీరంలో ‘ఇంటర్ ఫెరాన్’ అనే రసాయం (శరీరంలోని అనారోగ్య లక్షణాలను సరిదిద్దగలిగేది) ఉత్పత్తి అవుతుంది. హాయిగా నవ్వటం, నవ్వించటం ఎంతో మేలు’ అంటారు ప్రముఖ కవి, కాలమిస్టు సమీక్షకులు చిత్రకారులు, రచయిత సుధామ. తన 21 కథలతో పాఠక దేవుళ్లను పి.వి.రమణకుమార్ హాస్యాభిషేకిస్తున్నారు. పాఠకుడిలో ఉత్సాహాన్ని నింపుతాయి. అసలు రహస్యం, ముగ్గుల మొగుడు, రేపటి హీ(జీ) రోలు, సెల్ (గందర)గోళం, మందు భాగ్యుడులాంటి మంచి కథలు కడుపుబ్బా నవ్విస్తాయి. మనసును తేలిక పరుస్తాయి. అసలు కథకు ఇచ్చిన టైటిల్‌తోనే (దొంగగా(డు)రు, మన్మథ లేహ్యం, ఉత్తరాల ఊర్వశి, జబ్బులు ఎవరికీ ఊరికే రావులాంటివి) మనసు ఆకట్టుకుంటారు. నల్లేరుమీద నడకలా సాగే శైలిలో సున్నితమైన పదాల/వాక్యాల హాస్యం పొదుగుతారు. వయసు తక్కువ వేదాంతి (2) బద్ధ విగ్రహా మంత బుద్ధిగా బ్రతకటం (28) దుఃఖం థంప్సప్‌లా ఎగదన్నటం (29) సెల్లు గొల్లు మనటం (32) గతాన్ని గిలకొట్టటం (36) పెన్నుతో కన్ను పొడుచుకోవటం (40)లాంటి వాక్యాలు సరదా పుట్టిస్తాయి. ఈ హాస్యకథల హరివిల్లు హాస్యప్రియులందరినీ అలరిస్తుంది.

**(హాస్యాభిషేకం, రచన: పి.వి.రమణ కుమార్, వెల: రూ70, ప్రతులకు: పి.వి.రమణ కుమార్, పొన్నంవారి వీధి, కె.బి.రోడ్, చిలకూలూరిపేట)** **- కూర చిదంబరం**

## ఊహాలకే ఊపిరొస్తే? కవిత్వమవుతుంది



‘ఊహలకే ఊపిరొస్తే’ ఏమవుతుంది? కవిత్వమై ఉప్పొంగుతుంది. కవిత్వానికి ప్రాణం ఊహే కదా! ఊహల్లో మెరిసింది ఓ సుందరి. ఆ ఊహాసుందరి కనబడీ, కనబడకుండా కవ్విస్తూ విరహావేదనను రగిలిస్తుంటే మైమరిచిన కవి కె.హరనాథ్ కవిత్వమై పరవశిస్తున్నాడు. కవితలతో బంధిస్తున్నాడు. కృష్ణశాస్త్రి కవితలా, బాపు బొమ్మలా, రవివర్మ చిత్రంలా ఆ సుందరిని ఊహిస్తున్నాడు. ‘ప్రతి అక్షరం భావకవిత్వ తోరణంతో’ ఆ చెలిని అలంకరిస్తున్నాడు. ‘నా ఊహలకు ఊపిరిలూడిన/ ఊహాసుందరి నీవే కదా..’అంటూ తమకంతో ఆమె తేనెలూరు పెదవులు, కాటుక కనులు, పలు వరుసలు, చెక్కిళ్ళు, చిరునవ్వులు, నుదుటిన మెరిసే సింధూరం, కురుల హోయలు, కాళ్లకు అద్దిన పారాణి, విరజాజి తీగల్లాంటి కురులు, పసిడిఛాయమేను, గోరింటాకు పండిన అరచేతులు, కంఠాభరణం, చీర కట్టు, సమపాళ్ళ అవయసౌష్ఠవం, చెవిరింగుల పొదుగు యిలా అణువణువు అక్షరాలతో తడుముతాడు. ప్రణవ కవిత్వమై అల్లుకుపోతాడు. ‘అప్పుడప్పుడూ వర్ణనలో/దొర్లిన పదాలే దొర్లటం సహజం’ అని ఒప్పుకుంటాడు. ‘ఆ ఊహాసుందరికే..నా కవితలన్నీ అంకితం’ అంటూ ఆమె ఎవరో చెప్పేస్తాడు. ‘నా ఎదపై నిత్యం కదలాడే ఆ దేవత.,,నాతో ఏడడుగులు నడచిన నా సగభాగం’ అని తేల్చేస్తాడు. అర్థం కాలేదా? అదేనండీ.. ‘ఆవిడెవరో కాదు..మా ఆవిడే’ అని ముక్తాయిస్తాడు. కవితా శీర్షికలు తొలగించి వరుసక్రమాన్ని సవరించి చదివితే ఓ ప్రేమకావ్యంలా దీర్ఘ కవితలా ముస్తాబవుతుంది. మీరు చదవండి..నాతో ఏకీభవిస్తారు.

**(ఊహలకే ఊపిరొస్తే...రచన: కె.హరనాథ్, వెల: రూ 140, ప్రతులకు: ఫ్లాట్ నం.14, సరూర్‌నగర్, హైదరాబాద్)** **- రమణ వెలమకన్ని**

## జీవన వ్యధా కథాచిత్రాలు



షేక్‌హుసేన్ సత్యాగ్ని, ‘దివార్’ సంపుటిలో ఆణిముత్యాలలాంటి పది కథలున్నాయి. ముస్లిం జీవితాలలోని చీకటి కోణాలను, అన్యాయ అనాచారాలను ఈ కథలు వేలెత్తి చూపుతున్నాయి. ‘నికా’, ‘బాంది’, ‘దివార్’ మూడుకథలలో ముస్లిమ్ యువతుల తిరుగుబాటు చైతన్యం స్పష్టమవుతోంది.‘బాంది’ కథలో అత్తకోడల్ని హింసే, ‘మా’ కథలో కోడలు అత్తను నిరాదరణ గురి చేస్తుంది. బడీరాత్, శిక్ష, మౌనముని, పాస్‌బుక్ కథలు వాస్తవిక వ్యథలను ప్రతిబింబింపచేస్తున్నాయి. తెలుగు కథా సాహిత్యంలో తొలిమైనారిటీ కథలు షేక్‌హుసేన్ సత్యాగ్ని, చేతిలో శ్రీకారం చుట్టుకోవడం ఎంతైనా అభినందనీయం.

మతధర్మాలను ఏ సాహితీ ప్రక్రియ అయినా కనీసం స్పృశించటమే సాహసంగా భావించవలసిన అగత్యం తలెత్తిన ఈ రోజులలో, ఇస్లాం ధర్మాలను ఆసరా చేసు కొని అన్యాయ, అక్రమ, దురాచారాలను ఎండగట్టడం, తిరుగు బాటు ముస్లిం మహిళల వ్యథాభరిత యితివృత్తాలను కథలుగా వాస్తవీకరించటం, సామాజిక శ్రేయస్సు, ప్రయోజనం. ఈ కథా రచయిత చదువరులను ఆకట్టుకొంటారు.

**(దివార్, రచన: షేక్ హుసేన్ సత్యాగ్ని, వెల: రూ 120, ప్రతులకు: ఫాతిమా ప్రచురణలు, 17/1, రాయల పంతులపల్లె, కృష్ణాపురం, కడప-516003)**

**- ఎర్రమిల్లి**

ఇంటర్నెట్ మనిషి జీవితాన్నే మార్చేసింది. అనేక రకాలుగా ఉపయోగపడుతున్నది. అనేక సర్వీసులు, పనులను సులభతరం చేసింది. అంతేగాక ప్రతీ చిన్న విషయానికి కూడా ఇంటర్నెట్ మీద ఆధారపడవలసి వస్తోంది. నిద్ర లేచినప్పటి నుంచి పడుకునేంత వరకు ఇంటర్నెట్ వినియోగం మనిషి జీవితంలో తప్పనిసరి అయ్యింది. దీన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు సులువుగా మోసం చేస్తున్నారు.



# డిజిటల్ యుగం

**వాసిలి సురేష్**

53 సంవత్సరాల క్రితం అక్టోబర్ 29, 1969న 22.30 నిమిషాలకు రెండు కంప్యూటర్ల మధ్య మొట్టమొదటిసారిగా ఎలక్ట్రానిక్ సందేశాన్ని ప్రసారం చేయటం జరిగింది. లాస్ ఏంజెల్స్‌లోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం (యూసీఎల్‌ఏ)లో విద్యార్థి ప్రోగ్రామర్‌గా ఉన్న చార్లీ క్లైన్ అడ్వాన్స్ రీసెర్చ్ ప్రాజెక్ట్స్ ఏజెన్సీ నెట్‌వర్క్ ద్వారా ప్రొఫెసర్ లియోనార్డ్ క్లెయిన్రాక్ పర్యవేక్షణలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని ఎస్‌డిఎస్ సిగ్మా 7 హోస్ట్ కంప్యూటర్ నుంచి స్టాన్‌ఫర్డ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న మరో ప్రోగ్రామర్‌కు చెందిన ఎస్‌ఆర్‌ఐ ఎస్‌డిఎస్ 940 హోస్ట్ కంప్యూటర్‌కు మొట్టమొదటి సారిగా ఎలక్ట్రానిక్ సందేశాన్ని ప్రసారం చేసారు. రెండు కంప్యూటర్ల మధ్య ఎలక్ట్రానిక్ సందేశాన్ని పంపేందుకు ఇంటర్నెట్‌ను మొదటిసారిగా వినియోగించిన సందర్భాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 29ని అంతర్జాతీయ ఇంటర్నెట్ డేగా ప్రకటించారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఇంటర్నెట్‌పై పరిశోధనలు జరుగుతున్న రోజుల్లో ఇంటర్నెట్ ARPANETగా పిలవబడింది. 2005 నుంచి ప్రపంచ ఇంటర్నెట్ దినోత్సవాన్ని టెలీ కమ్యూనికేషన్స్ ఇంకా టెక్నాలజీ చరిత్రలో చిరస్మరణీయమైన రోజుగా అభివర్ణిస్తున్నారు. నేటి ఆధునిక యువతపై ఇంటర్నెట్ తీవ్ర స్థాయిలో ప్రభావం చూపుతోంది. కమ్యూనికేషన్ విభాగంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుంది. ఇంటర్నెట్ మత్తులో మునిగితేలుతున్న యువత తమ తమ లక్ష్యాలను పక్కన పెట్టి కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. గంటలకొద్ది చాటింగ్, వీడియో కాల్స్, గేమ్స్, రీల్స్‌ల, యూట్యూబ్, ఇంటర్నెట్ బ్రౌజింగ్.. ఇలా అదేపనిగా వెబ్ ప్రపంచంలో విహరిస్తున్నారు. మితిమీరిన ఇంటర్నెట్ వినియోగం మానసికంగా, శారీరకంగానూ మంచి కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కరోనా కాలంలో విద్యార్థులకు చదువుల కోసం కొనిచ్చిన స్మార్ట్ ఫోన్లను ఆన్‌లైన్ షాపింగ్, గేమింగ్, సామాజిక మాధ్యమాల కోసం వాడుతున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి సానుకూల ఆలోచనలు పంచుకోవడం, కెరీర్ నిర్మాణానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగించుకునేలా నేడు విద్యార్థులను చైతన్యపర్చాలి. చదువు, ఉద్యోగ, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే వాతావరణం కల్పించుకోవాలి. చదువేతర, నేర సంబంధ అంశాల్లో తలదూర్చడం వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించాలి. అనేక రకాలుగా ఇంటర్నెట్ ద్వారా మోసపోయిన తల్లిదండ్రులు, సంరక్షకులు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. పిల్లల ఇంటర్నెట్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. సామాజిక మాధ్యమాలకు వెచ్చిస్తున్న సమయాన్ని తగ్గించాలి. ఇతరుల మనోభావాలను గౌరవించేలా తీర్చిదిద్దాలి. సృజనాత్మక, మెరుగైన జీవన విధానాన్ని అలవర్చుకునేలా చైతన్యపర్చాలి.

సైబర్ నేరాల నియంత్రణ కోసం సంబంధిత చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. రోజుకో తరహాలో వెలుగు చూస్తున్న మోసాల బారిన పడకుండా ఉండేందుకు వినియోగదారుల్లో విస్తృతంగా అవగాహన పెంపొందించాలి. డిజిటల్ అక్షరాస్యత సాధించే కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాలపై నిఘా, ప్రత్యేక సైబర్ వ్యవస్థ ఏర్పాటు చేయల్సిన అవసరం ఉంది.

ఆన్‌లైన్ తరగతుల కోసం స్మార్ట్‌ఫోన్లు ఉపయోగించడం అలవాటు పడిన విద్యార్థులు కొందరు ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడి లక్షల రూపాయల నగదు పోగొట్టుకున్నవారు వున్నారు. యువకులు ఆన్‌లైన్‌లో పరిచయమైన యువతులతో అతి చనువుగా ప్రవర్తించడం, వీడియో కాల్స్ నందు నగ్నంగా కనిపిస్తున్న వీడియోలు రికార్డులు చేసి తర్వాత బ్లాక్‌మెయిల్ ద్వారా డబ్బులు పోగొట్టుకున్నవారున్నారు. చరవాణికి వచ్చిన సందేశానికి స్పందించి ఓటీపీ చెప్పడంతో బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును పోగొట్టుకున్నవారున్నారు. నేడు చాలా మంది ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానంపైన అవగాహన లేకపోవడం వల్ల, అత్యాశ పెరగడం వల్ల ఇటువంటి మోసాలు జరుగుతున్నాయి. ఎక్కువ మందికి సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన లేకపోవడం వల్ల మోసపోతున్నారు. కాబట్టి ప్రజలు సైబర్ క్రైమ్స్ పై అవగాహన కలిగివుండాలి. వీటిలో క్రెడిట్ కార్డ్ మోసాలే అధికంగా ఉంటున్నాయి. దీనికి పిన్ కూడా అవసరం లేకపోవడంతో క్రెడిట్ కార్డ్స్ డేటా హాకర్స్ చేతిలో పడటం వల్ల ఈ విధమైన మోసాలు జరుగుతున్నాయి. కార్డులో నుంచి కనుక అనుమతి లేకుండా డబ్బులు కట్ అయితే గనుక వెంటనే మినీ స్టేట్‌మెంట్ తీసి పోలీస్ స్టేషన్‌లో కేసు బుక్ చేయాలి. కేసు బుక్ చేసిన తర్వాత వాళ్ల ఇచ్చినటువంటి ఎఫ్ఐఆర్ కాపీని బ్యాంకులో సబ్మిట్ చేస్తే డబ్బులు కట్టవలసిన అవసరం ఉండదు. డబ్బులు కట్ అయిన వెంటనే కేసు పెట్టాలి. లేదంటే ప్రయోజనం ఉండదు. బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాం, మీ డెబిట్ కార్డ్ ఎక్స్పైర్ అయిపోతుంది. యాక్టివ్ చేసుకోకపోతే ఎకౌంటుని బ్లాక్ చేస్తామని చెపి మోసాలకు పాల్పడటం చూడవచ్చు. విషయం తెలియక వారు అడిగిన వివరాలను చెబుతారు. తర్వాత మీ ఫోన్‌కి ఒక కోడ్ వస్తుంది చెప్పమని అడిగి, అకౌంట్‌లో ఉన్న డబ్బులన్నీ విత్‌డ్రా చేస్తారు. ఎప్పుడూ ఏ బ్యాంకువాళ్లు కూడా మీకు ఫోన్ చేసి ఎలాంటి వివరాలు అడగరు. ఎవరైనా ఫోన్ చేసి మేం బ్యాంకు నుండి అని చెప్తే కనుక అది మోసం చేస్తున్నారని అర్థం. ఏ పరిస్థితులలోనూ ఏటీఎం పిన్,



అలాగే మీ డెబిట్ కార్డ్ వెనకాల ఉన్న సివివి నెంబర్ కూడా ఎవరికీ చెప్పరాదు. గిఫ్ట్ వచ్చిందని, లాటరీ టికెట్ తగిలిందని, లండన్ నుండి గిఫ్ట్ వచ్చిందని మోసాలకు పాల్పడటం చూడవచ్చు. డబ్బులు కావాలంటే కస్టమ్స్ టాక్స్, జిఎస్టీ కట్టాలని ఫోన్ చేసి లక్ష నుండి ప్రారంభించి సుమారు పది లక్షల వరకు కట్టాలని చెప్తారు. నిజం తెలుసుకుని మనకు వచ్చే డబ్బు కన్నా ఈ లక్ష రూపాయలు తక్కువే అనుకుని కట్టేస్తారు. కట్టిన తర్వాత మోసపోయామని తెలుస్తుంది. అత్యాశను విడిచిపెట్టాలి. చాలామంది ఓఎల్ఎక్స్‌లో ఇంట్లో పనికిరాని సామాన్లు అమ్మడంగానీ, లేదా వేరేవాళ్లు వాడిన సామాన్లను కొనడంగానీ చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని, ప్రొడక్ట్ పెట్టిన వెంటనే కాల్ చేసి మాకు ప్రొడక్ట్ నచ్చిందని నాకు చాలా అవసరం ఉందని చెప్పి, అందుకే మీకు డబ్బులు కూడా ముందే వేస్తున్నా అని చెప్తారు. వెంటనే మీకు ఒక క్యూఆర్ కోడ్ పంపి దాన్ని స్కాన్ చెయ్యగానే మీకు డబ్బులు పడిపోతాయి అని చెబుతారు. క్యూఆర్ కోడ్‌ని గూగుల్ పే లేదా ఫోన్ పే ద్వారా స్కాన్ చేసిన వెంటనే అకౌంట్‌లో ఉన్న డబ్బులు వాళ్లకి వెళ్లిపోతాయి. కేవలం డబ్బులు ఒకరికి ఇవ్వడానికి మాత్రమే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయాలి. ఎవరైనా డబ్బులు ఇవ్వాలి అంటే మీ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయాలని గుర్తుంచుకోవాలి. కెవైసి వెరిఫికేషన్ మోసాలలో ముందుగా మీకు ఫోన్ చేసి మీ బ్యాంక్ అకౌంట్‌కి లేదా మీ ఇన్సూరెన్స్‌కి ఆధార్ కార్డు, పాన్ కార్డు లింక్ అవలేదని చెప్పి, ఒకవేళ చేయకపోతే మీకు రావాల్సిన అమౌంట్ అంతా కట్ అయిపోతుంది అని చెప్పి నమ్మించి, కార్డ్ డీటెయిల్స్ కానీ, పిన్ నంబర్ కానీ చెప్పొద్దు అని చెబుతారు. ఇక్కడే వాళ్ల ట్రాప్‌లో పడతారు. మీ ఫోన్ ద్వారానే ఈ ఆధార్ కార్డు లింకు చేయొచ్చు అని చెబుతారు. దానికోసం ముందుగా మీ ప్లే స్టోర్ నుండి టీమ్ వ్యూయర్ అనే యాప్‌ని మీ చేత డౌన్‌లోడ్ చేయిస్తారు. తర్వాత స్క్రీన్ షేరింగ్ లింక్‌ను వాళ్లకు పంపమని అడుగుతారు. ఒకసారి మీరు యాప్‌ని మీ చేత డౌన్‌లోడ్ చేయిస్తారు. తర్వాత స్క్రీన్ షేరింగ్ లింక్‌ను వాళ్లకి పంపమని అడుగుతారు. ఒకసారి మీరు ఆ లింక్ వారికి పంపితే కనుక మీరు ఫోన్‌లో చేసే ప్రతిదీ వాళ్లకి కనిపిస్తుంది. డెబిట్ కార్డ్ డీటెయిల్స్, సివివి, పిన్ నెంబర్ ఎంటర్ చేయమంటారు. మన పిన్ మనమే ఎంటర్ చేస్తున్నాం కదా ఏమీ అవదు అనుకుని ఎంటర్ చేస్తారు. కానీ మనం ఒకే బటన్ మీద క్లిక్ చేసేలోపు డీటెయిల్స్ అన్నీ టీమ్ వ్యూయర్ యాప్ ద్వారా చూసి వాళ్ల అకౌంట్‌కి కొన్ని సెకండ్స్ వ్యవధిలో మన డబ్బు మొత్తం ట్రాన్స్‌ఫర్ చేసుకుంటారు. ఎవరైనా ఫోన్ చేసి టీమ్ వ్యూయర్ యాప్ ఇన్‌స్టాల్ చేయమంటే మోసం అని అర్థం. ఫేస్‌బుక్‌లోగానీ, ఇన్‌స్టాగ్రామ్‌లోగానీ ఫ్రెండ్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసేముందు మనం చేసే మొదటి పని మ్యూచువల్ ఫ్రెండ్స్ ఎంతమంది ఉన్నారని గమనిస్తాం.

దీన్ని ఆధారంగా చేసుకుని కొంత మంది వ్యక్తులు వీటి ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వీరి టార్గెట్ టీనేజ్‌లో ఉన్నటువంటి అమ్మాయిలు, అబ్బాయిలు.

**(మిగతా 27వ పేజీలో)**

కథ

# తీరిన నక్క కోరిక

ఒ అడవిలో నక్క తన మిత్రులందరిని సమావేశపరచి "నేను ఏనుగుపై ఎక్కి ఊరేగుతాను" అని చెప్పింది.
దానికి నక్కమిత్రులు "ఏనుగుపై సవారే! అది ఎప్పటికీ సాధ్యం కాదు. రాజులే ఏనుగుపై ఎక్కి ఊరేగుతారు. నువ్వు ఏ దేశానికి రాజువి" అన్నాయి హేళనగా.
"ఏనుగుపై ఊరేగితే మీ అందరికి రాజును నేనే, ఒప్పుకుంటారా?" అంది.
"ఓ! ఒప్పుకుంటాం.. అయితే రెండు రోజులలో నువ్వు ఏనుగుపై ఎక్కి మా మధ్యగుండా వెళ్లాలి" అన్నాయి.
"సరే" అంది నక్క.
ఏనుగుపై స్వారీ అంటే మాటలా! అనవసరంగా మా వాళ్లకు మాటిచ్చాను. ఇప్పుడు ఏం చేయాలి? అని ఆలోచించింది. ఓ మెరుపు లాంటి ఆలోచనతో ఏనుగు దగ్గరకు కుంటుతూ వెళ్లింది.
నక్కను చూడగానే ఏనుగు "ఏం నక్కమామా? కుంటుతున్నావ్?" అంది.
"ఏం లేదు మామా! మీకు ఆహారం కోసం అడవంతా గాలిస్తుంటే.." అని చెబుతుండగా–
ఏనుగు కల్పించుకుని "ఏమిటీ? మాకు ఆహారం కోసం వెతికావా? ఎక్కడ?" ఉత్సాహంగా అడిగింది ఏనుగు.
"ఓ చోట చెరుకుతోట ఉంది మామా! అది చెబుదామనే మీ దగ్గరకు వస్తుంటే ముల్లు గుచ్చుకుంది. అబ్బా.. అబ్బా" అని మూలిగింది.
చెరకుతోట అనగానే ఏనుగుకు నోరు ఊరింది.
"అయితే ఆ తోట నాకు చూపించు" అంది.
"అది చాలా దూరం మామా! నేను నడవలేను" అంది.
"అయితే నాపై ఎక్కి దారి చెబుతూ వుండు" అంది.



"రేపు ఉదయం వెళదాం" అంది.
"సరే.. రేపు నీ దగ్గరకు వస్తాను" అంది ఏనుగు.
నక్క సంతోషించింది. మాట అయితే ఇచ్చిందిగానీ అసలు చెరకుతోట ఎక్కడ ఉందో దానికే తెలియదు. ఏనుగుకు ఆశ పెట్టాను. తోట లేదని తెలిస్తే నా తాట తీస్తుంది. తొండంతో విసిరేసి, పాదాలతో నన్ను తొక్కేస్తుంది. ఇప్పుడెలా?" అని ఆలోచిస్తోంది. ఎలాగు ఈ రోజంతా సమయం ఉంది. ఈ అడవిలో ఎక్కడో ఓ చోట చెరకుతోట ఉండకపోదా?" అని అనుకుని నిద్ర మాని అడవంతా గాలించింది. ఓ చోట చెరకుతోట కనపడగానే దాని మనసు కుదుట పడింది. ఆ తోటను చూడగానే గంతులు వేసింది. తోటను గుర్తుకు పెట్టుకొని తన మిత్రుల దగ్గరకు వెళ్లింది.
"రేపు ఉదయమే ఏనుగు ఇక్కడకు వస్తుంది. నేను దానిపై ఎక్కి మహారాజులా ఉంటాను. మీరే చూస్తారుగా" అంది.
"ఏనుగు మీద సవారే!" అని నక్కమిత్రులు ఆశ్చర్యపోయాయి.
అనుకున్నట్లుగానే నక్క ఉన్న చోటుకు వచ్చి ఘీంకారం చేసింది.
నక్క తన మిత్రులతో కుంటుతూ వచ్చింది. ఏనుగు కాళ్లు వంచి నక్కను తనపై ఎక్కించుకుంది.
ఏనుగుపై ఎక్కిన నక్క మీసం మెలేస్తూ ఠీవిగా, దర్జాగా ఉంది. అది చూసి నక్కమిత్రులు సంతోషంతో చప్పట్లు కొట్టాయి. "మొత్తానికి మన మిత్రుడు అనుకున్నది సాధించాడు, మనకు రాజు అయ్యాడు. ఏనుగు మీద స్వారీ కూడా చేస్తున్నాడు" అనుకున్నాయి నక్కమిత్రులు.

**- కనుమ ఎల్లారెడ్డి**







## బాలగేయం

### ముద్దు పిల్లలు



జగతిలోన వెలుగులు
పాలకడలి తరగలు
ముద్దులొలుకు పిల్లలు
తెల్లని సిరిమల్లెలు
రంగుల హరివిల్లులు
సొగసుల విరిజల్లులు
ముద్దులొలుకు పిల్లలు
దేశానికి ఎల్లలు
ప్రశాంతమైన పల్లెలు
జీవజలపు ఊటలు
పసిపిల్లల మాటలు
జుంటితేనె ధారలు
అభివృద్ధికి బాటలు
అపురూపం బాలలు
పసిపిల్లలు వేల్పులు
ఇంట ఉన్న శుభములు

**- గద్వాల సోమన్న**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.ప్రణవ్,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చేతి గడియారాల మీద జ్యుయల్స్ సంఖ్య ఉంటుంది. జ్యుయల్స్ అంటే ఏమిటి? వాటి ప్రయోజనం ఏమిటి?**

**జవాబు:** ప్రణవ్! సాధారణంగా గడియారం లోపలి భాగంలో 211 విడిభాగాలు ఉంటాయి. వీటిలోని ఒక చిన్న చక్రం ఏకధాటిగా తిరుగుతుంటుంది. దీనితోనే ఒక వెంట్రుక తరహాలో వున్న సన్నటి తీగ(మేర్ స్ప్రింగ్) ఉంటుంది. ఈ స్ప్రింగ్‌ను 'కీ' ద్వారా



చుట్టినప్పుడు గడియారం టిక్ టిక్ అని శబ్దం చేస్తూ పనిచేయడం ప్రారంభిస్తుంది. స్ప్రింగ్‌కు అందిన శక్తి గడియారానికి జీవం వంటిది. ఈ చక్రంతో పాటు ఇంకా పలు చక్రాలు తిరగడం ప్రారంభిస్తాయి. ఈ చక్రాలే గంట, నిమిషాల, సెకన్ల ముల్లును తిప్పుతూ వుండి, సమయాన్ని చూపుతాయి. ఇవి నిరంతరాయంగా తిరగడం వల్ల వీటి ఇరుసులు, అతికింపుల నడుమ రాపిడి పెరిగి ఇరుసులు త్వరత్వరగా అరిగిపోతుంటాయి. పనితనం క్షీణిస్తుంది. ఈ రాపిడిని తగ్గించడానికి అతుకులలో దృఢమైన, నునుపైన చిన్న చిన్న ముక్కలను బిగిస్తారు. వీటినే 'జ్యుయల్స్' అంటారు. జ్యుయెల్ అంటే మణులు, రత్నాల వంటి విలువైనని అర్థం వుంది గదా! గడియారంలోని జుయెల్స్‌గా కెంపు, ఇంద్రనీలాలను వాడుతుంటారు. వజ్రం తరహాలో అతిదృఢమైన రాళ్లు ఇవి. ఇవి బాగా నునుపుగా కూడా ఉంటాయి. గడియారంలోని చక్రం ఇరుసులను ఈ రాళ్ల మధ్య అతి జాగ్రత్తగా బిగిస్తారు. దీని మూలంగా రాపిడి తగ్గుతుంది. ఈ రాళ్లు దృఢంగా వుంటాయి కాబట్టి త్వరగా అరిగిపోవు. చక్రాలన్నీ సవ్యంగా పనిచేయడంతో గడియారం ఎక్కువ కాలం పని చేస్తుంది. ఈ జ్యుయెల్స్ సంఖ్య ఎంత ఎక్కువ సంఖ్యలో వుంటే గడియారం అంత మన్నికగా ఉంటుంది.







# నవ్వు దివ్యౌషధం

ఆధునిక జీవితం విలాసాలకు నిలయంగా మారింది. సంపాదన కోసం ఉరుకులు, పరుగులు తీస్తున్నాం. సౌకర్యాల కోసం తపిస్తూ సుఖాలకు దూరమవుతున్నాం. మానసిక ఒత్తిళ్లను మోస్తూ రుగ్మతలు, రోగాలను భరిస్తూ బతుకుబండిని లాగుతున్నాం.

ఈ నేపథ్యంలో మానసిక శాంతి కోసం పరితపిస్తున్నాం. నవ్వుకు దూరం కావడమే ఇలాంటి పలు సమస్యలకు మూలం అంటున్నారు సైకాలజిస్టులు. దీనినే సినీ కవి ఒకరు అందంగా చెప్పారు.. 'నవ్వడం భోగం, నవ్వించడం యోగం, నవ్వకపోవడం ఒక రోగం" అని.

తల పండిన ఒక వృద్ధ మహిళ మాట్లాడుతూ చక్కటి వివరణ ఇచ్చింది. తమ చిన్నతనంలో నూకలు దొరకకపోయినా నవ్వులు పండేవని, ఇప్పుడు రూకలు(డబ్బు) కోసం పరుగులు తీస్తూ నవ్వులకు దూరమవుతున్నారని చలోక్తి విసిరింది.

ఇప్పటి జీవనశైలి, దృక్పథం, తపన పరిశీలిస్తే ఆమె మాట అక్షర సత్యం అనిపిస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే మనం నవ్వును మరచిపోతున్నాం అనిపిస్తోంది. ఏడాదికో శివరాత్రి అన్నట్లు కొంతమంది ఎప్పుడో ఒకప్పుడు నవ్వుకు నోచుకుంటున్నారు. 1950వ సంవత్సరం ప్రాంతంలో ప్రతి మనిషి రోజుకు సగటున 18 నుండి 20 నిమిషాలు నవ్వేవారని అంటున్నారు. ఇప్పుడు సగటున రోజుకు 4,5 నిమిషాలు నవ్వితే గొప్పని సర్వేలు చెప్తున్నాయి. దీంతో నవ్వడం, నవ్వించడం కోసం లాఫింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసుకునే పరిస్థితులు వచ్చాయి. పిల్లలు, పెద్దలు ఇంట్లో కూర్చుని సరదాగా మాట్లాడుకుంటూ హాస్యం పండించడం మాని నవ్వడం కోసం క్లబ్బులకు వెళ్తున్నాం. అక్కడ కృత్రిమంగా నవ్వడం కోసం తంటాలు పడుతున్నాం. ఈ దశలో నవ్వుల వెల, విలువ, ఉపయోగాలు తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మానవ సంబంధాలు పెంచుకుంటూ నవ్వులు పంచుకోవడానికి అందరం సిద్ధం కావాలి.

## సైడ్ ఎఫెక్ట్స్ లేని దివ్యౌషధం

మనం అనేక రకాల రోగాలు, రుగ్మతలకు మందులు వాడుతుంటాం. అయితే ప్రతి మందు వల్ల ఏదో ఒక సైడ్ ఎఫెక్ట్ ఉంటుంది. కానీ హాస్యం(నవ్వు) మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ లేని దివ్యౌషధంలా పని చేస్తుందని నిపుణులు ముక్తకంఠంతో చెపుతున్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన సైకాలజీ ప్రొఫెసర్ విలియమ్స్ ఎఫ్ ఫ్రైడే ఏకంగా 'గెలటాలజీ' అనే నవ్వుల శాస్త్రాన్నే రూపొందించారు. నవ్వు ఆరోగ్యానికి-చికిత్సకు ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేయడానికే ఆ విభాగాన్ని రూపొందించారు. ఇదిలా ఉండగా నవ్వు వల్ల ఆనందం, ఆహ్లాదం దొరకడమే కాకుండా ఆయుష్షు కూడా పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఎప్పుడూ నవ్వని ఆటగాళ్లు సగటున 72.9 ఏళ్లు జీవించారని ఒక సర్వేలో తేలింది. మామూలుగా నవ్వే ఆటగాళ్లు 75 ఏళ్లు జీవించగా- బిగ్గరగా నవ్వేవారు 79.9 ఏళ్ళు జీవించినట్లు పరిశోధనల్లో తేలిందని అంటున్నారు. అంటే హాయిగా మనస్ఫూర్తిగా, బిగ్గరగా నవ్వేవాళ్లు ఏడేళ్లు అదనంగా జీవిస్తారని వెల్లడైంది. దీనికి కారణం నవ్వు వల్ల అనేక శారీరక, మానసిక ప్రయోజనాలు ఉండటమేనని డాక్టర్లు, సైకాలజిస్టులు చెప్తున్నారు.

మనం నవ్వడం వల్ల మనసు తేలిక పడటం అందరికీ తెలిసిందే. అయితే దీని వెనుక ఉన్న శాస్త్రీయమైన కారణాలు మాత్రం అందరికీ పూర్తిగా తెలియదు.

**డాక్టర్ బి.ఎన్.సుధాకర్ రెడ్డి,**
**సైకాలజిస్ట్**

సహజంగా నవ్వినప్పుడు సానుకూలమైన రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. వీటినే ఫీల్‌గుడ్ హార్మోన్లు అని కూడా వ్యవహరిస్తుంటాం. నవ్వినపుడు ముఖ కండరాలలో కదలికలు వస్తాయి. ఉద్వేగాలను నియంత్రించే మెదడుభాగాలు స్పందించి సానుకూల రసాయనాలైన ఎండార్ఫిన్స్, డోపమైన్స్ విడుదల చేస్తాయి. నలుగురితో కలసి సరదాగా నవ్వుకున్నప్పుడు ఆనందాన్ని పంచుకున్నప్పుడు సెరటోనిన్, ఆక్సిటోసిన్ కూడా ఉత్పత్తి అవుతుందని నిపుణులు వివరిస్తున్నారు. సాధారణంగా ఈ నాలుగు హార్మోన్లు మనుషుల్లో సంతోషం, ఆనందం, ఆహ్లాదం, ప్రేమ, స్నేహభావం, ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, నిద్ర పెంపొందించడానికి ఉపయోగపడతాయి. అందుకే చిన్నప్పటి నుంచి స్నేహ సంబంధాలు పెంపొందించుకోమని సలహాలు ఇస్తుంటారు. కాగా మనసు బాధపడినపుడు, ప్రతికూల భావాలు కలిగినపుడు, అవరోధాలు ఎదురైనపుడు ఒత్తిడిని కలిగించే అడ్రినలిన్, కార్టిసాల్ లాంటి హార్మోన్లు విడుదల అవుతాయి.

దీనివల్ల మనసు వికలమవుతుంది. దిగులు, బాధ, భయం, ఆందోళన, డిప్రెషన్ ఆవహిస్తాయి. ఏకాగ్రత తగ్గడం, ఆకలి మందగించడం, నిద్ర పట్టకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. దీనివల్ల జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం కూడా సన్నగిల్లుతుంది. దీర్ఘకాలం ఒత్తిడికి గురవడం వల్ల గుండె ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి. రక్తపోటు, మధుమేహం సమస్యలు వస్తాయి. గుండెపోటు, ఆత్మహత్యలకు దారి తీసే ప్రమాదం కూడా ఉంది.

ఈ నేపథ్యంలో నవ్వుకు విలువ ఇచ్చి సరదాగా నవ్వుకోగలిగితే ఒత్తిడి కలిగించే హార్మోన్లను తగ్గించి సానుకూల హార్మోన్లను పెంచుకోవచ్చని నిపుణులు అంటున్నారు. నవ్వడానికి రూపాయి ఖర్చుగానీ, పరికరాలుగానీ అవసరం లేదు. విలాసవంతమైన భవనాలు, కార్లు, హోటళ్ల అసలే అవసరం లేదు. నలుగురు మంచి వ్యక్తులు, స్నేహితులు, సన్నిహితులు ఉంటే చాలు.. అందులో ఒకరో ఇద్దరో చలోక్తులు విసిరి హాస్యం పండించగలిగితే చాలు. అయితే భేషజాలు, అహం వీడి మనస్ఫూర్తిగా నవ్వగలిగే స్వభావం ఉంటే చాలని నిపుణులు అంటున్నారు. ఇలా హాయిగా నవ్వడం వల్ల ఆవేశం, ఉద్వేగాలు తగ్గిపోతాయి. ఒత్తిడి దరి చేరదు. రోగనిరోధక శక్తి, శరీరానికి మేలు చేసే యాంటీబాడీస్ పెరుగుతాయి.

## నవ్వు పలు రకాలు

నవ్వు సంతోషానికి సంకేతం. మానవ సంబంధాలలో ఉత్తేజం పెంపొందుతుంది. అయితే ఈ నవ్వులోను పలు రకాలు ఉన్నాయి. చాలా మంది పలు సందర్భాల్లో తాము ఆమోదం, సంతోషం తెలపడానికి చిన్నగా నవ్వుతారు. దీనిని చిరునవ్వు అంటారు. అనేక సందర్భాల్లో భావ వ్యక్తీకరణకు ఈ చిరునవ్వు చాలు. దీనినే చిరు దరహాసం అంటుంటాం. అలాగే నవ్వీ నవ్వనట్టు ఉండే నవ్వును ముసి ముసి నవ్వు అంటారు. ఎదుటివారి పట్ల ఇష్టాన్ని, సంతోషాన్ని, స్నేహాన్ని తెలపడానికి ఈ ముసి ముసి నవ్వు చాలు. కొంతమంది పెద్దవాళ్లు చాలా హుందగా చిద్విలాసం చేస్తుంటారు. వారు గట్టిగా నవ్వడానికి ఇష్టపడరు. అయితే చాలా మంది ఒక జోక్ వింటేనో, లేక హాస్య సన్నివేశం చూస్తేనో గట్టిగా నవ్వుతుంటారు. దీనిని పగలబడి నవ్వడం అంటుంటాం. కొంతమంది అహంకార పూరితంగా నవ్వుతుంటారు. తమకు ఎదురులేదన్నట్టు నవ్వడాన్ని వికటాట్టహాసం అంటాం. సినిమాలు, సీరియళ్లు, నాటకాలలో ప్రతినాయకులు ఎక్కువగా వికటాట్టహాసం చేస్తుంటారు. పసిపిల్లలు, అమ్మ, నాన్న, ఆత్మీయులను చూస్తే నోరు తెరిచి చేతులు ఆడిస్తూ నవ్వడాన్ని బోసినవ్వు అంటారు. పళ్లు ఊడిపోయిన వృద్ధులు కొందరు నవ్వితే కూడా బోసినవ్వులానే ఉంటుంది. ఇంకా కవులు, రచయితలు పలు నవ్వులను గురించి రాస్తుంటారు. అయితే పేరు ఏదైనా నవ్వు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అన్నింటికంటే పగలబడి లేదా విరగబడి నవ్వడం వల్ల ఎక్కువ ప్రయోజనం



ఉంటుంది. అందుకే అహం వీడి మనస్ఫూర్తిగా నవ్వడానికి ప్రయత్నించడం మంచిది.

## నవ్వు నాలుగు విధాల చేటా?

మన సమాజంలో నవ్వు పట్ల పలు అపోహలు ఉన్నాయి. నవ్వు నాలుగు విధాల చేటు అన్న సామెత ప్రాచుర్యంలో ఉంది. ఆడవారి నవ్వు వల్ల అనర్థాలు తప్పవనేవారున్నారు. అందుకే బాల్యం నుంచే ఆడపిల్లలను నవ్వినపుడు తల్లిదండ్రులు మందలిస్తుంటారు. ఆడపిల్ల అలా నవ్వకూడదని అంటుంటారు. మహాభారతంలో మయసభను దర్శిస్తూ తడబడ్డ దుర్యోధనుణ్ణి చూసి ద్రౌపది నవ్వుతుంది. ఆ నవ్వును అవమానంగా భావించిన దుర్యోధనుడు పగబట్టి నిండు సభలో ద్రౌపదిని వివస్త్రను చేయవలసిందిగా దుశ్శాసనుణ్ణి ఆదేశిస్తాడు. తరువాత కౌరవ, పాండవ యుద్ధం జరగడం, కౌరవులతో పాటు జన నాశనం జరుగుతుంది. దీనికంతటికీ ద్రౌపది నవ్వే కారణం కావడం వల్ల ఆడవారు నవ్వడం తప్పనే భావన ప్రాచుర్యం పొందింది. అయితే దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకూడదని సామాజిక వేత్తలు అంటున్నారు. ఎప్పుడో జరిగిన ఒక సంఘటన ఆధారంగా ఆడవారిని నవ్వుకు దూరం చేయడం మూర్ఖత్వం అంటు న్నారు. అయితే ఎదుటివారిని అనవసరంగా అవమానించడం లేదా చులకన చేయడానికి తోడ్పడేలా నవ్వకూడ దు. ఈ నియమం ఆడవారికే కాదు, మగ వారికీ వర్తిస్తుంది. ఎదుటివారిని అగౌరపర చడం వల్ల మానవ సంబంధాలు దెబ్బతిం టాయి. అలాంటి సందర్భాల్లో వివేకం ప్రదర్శించి నియంత్రించుకోవడం మంచిది. కాగా నవ్వీన నాపచేనే పండింది అన్న సామెత కూడా మన సమాజంలో బాగా ప్రచారంలో ఉంది. ఇదొక సానుకూల దృక్పథంగా పిల్లలు, పెద్దల్లో మనం పెంపొందించాలి. ఒక విధంగా చెప్పాలంటే ఈ సామెత– ఓటమి.. గెలుపుకు పునాది అన్న నానుడికి మూలంగా కనిపిస్తుంది. అంటే మనం ఓటమికి కుంగిపోకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచించి గెలుపుకు బాట వేసుకోవాలని అర్థం. అయితే కొంతమంది వ్యవహార శైలిని చూసి "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు" అనే సామెత పుట్టింది. కొంతమంది స్వార్థపర శక్తులు, సంఘ వ్యతిరేకులు విలువలను పట్టించుకోకుండా దిగజారి ప్రవర్తిస్తుంటా రని చెప్పడానికి దీనిని వాడుతుంటాం. సామెతలు, నానుడులు ఎలా ఉన్నప్పటికీ నవ్వడం వల్ల నలభై విధాల మేలన్నది గుర్తించాలి. అయితే సమయం, సందర్భం బట్టి నవ్వడం అలవర్చుకోవాలి.

## నవ్వడానికి మార్గాలు

చాలామంది నవ్వడానికి మార్గాలు ఎలా అంటుంటారు. నవ్వుకోవడానికి మానవ సంబంధాలే మూలం. కనీసం ఇద్దరు వ్యక్తులు కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుం టే చాలు. అలాగే హాస్యభరిత రచనలు చదివినా, సన్నివేశాలు చూసినా నవ్వు వస్తుంది. ఇంట్లో పెద్దలు పిల్లలు కలిసి మాటలు కలబోసుకుంటే నవ్వులు వెల్లివిరు స్తాయి. హోదాలు, ఉపన్యాసాలు చెప్పేవారిలో చాలా మంది హాస్యాన్ని పండించడానికి జోక్‌లు వేస్తుంటా రు. పిట్టకథలు చెప్పి నవ్విస్తుంటారు. గతంలో హరికథలు, బుర్రకథలు చెప్పే సమయంలో కూడా శ్రోతలను నవ్వించి ఆకట్టుకునేవారు. అందరం హాయిగా, సంతోషంగా ఉండాలి అన్న భావన ఉంటే చాలు. మనం కూడా ఎదుటివారితో ఆత్మీ యంగా ఉంటూ వారి మాటలకు స్పందిస్తే చాలు. ప్రతి వ్యక్తి ఉదయం చిరునవ్వుతో లేవాలి.. అన్న భావన పెంచుకోవాలి. తద్వారా ఆనందం, ఆరోగ్యం మీ సొంత మవుతాయి. అందుకే 'నవ్వు.. నవ్వించు.. ఆరోగ్యంగా జీవించు..' అన్నది తారక మంత్రంగా గుర్తించండి. ❍

కథ

# సెల్యూట్

షేక్ మహబూబ్ జాన్

**అప్పుడే సూర్యుడు హుషారుగా బయలుదేరాడు. అది నల్లమల అటవీ ప్రాంతం. దట్టమైన పచ్చని చెట్లతో రకరకాల అడవిపూలతో, ఆ పూల గుబాళింపుతో ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా వుంది.**

ఆ అటవీ ప్రాంతంలో అక్కడక్కడ గిరిజనులు గూడేలు కట్టుకొని, అడవిలో దొరికే పండ్లు, దుంపలు, కందమూలాలు, తేనె, కుంకుడుకాయలు, విప్పపూలు, వెదురుబియ్యం మొదలైనవి సేకరించి అవి అమ్ముకొని జీవనం సాగించేవారు.

ఆ ప్రాంతంలోనే విప్పగుంట అనే గూడెం వుంది. ఆ గూడెంలో దూర దూరంగా విసిరేసినట్లు కొంత మంది గిరిజనులు ఆవాసాలు ఏర్పరచుకొని స్వేచ్ఛగా, కపటం లేని మనసులతో, ఒకరికొకరు సహకరించుకుంటూ అంతా ఒక కట్టుబాటుగా జీవించేవారు.

ఒకరోజు పెంటమ్మ "ఏమయ్యో, నిన్న పంతులమ్మ యింటికి వచ్చి- మీ అమ్మాయి సుశీలను బడికి పంపండి. అక్కడ మేము ఉచితంగా పుస్తకాలు, నోట్సులు, బట్టలు యిస్తాం. అంతేగాదు.. మంచి రుచికరమైన మధ్యాహ్న భోజనం కూడా పెడతాం. అమ్మాయిని పంపండి.. నాలుగు అక్షరాలు నేర్చుకొని తెలివిమంతురాలౌతుంది" అంది. "అమ్మాయిని పిలుచుకొనిపోయి పేరు రాయిచ్చి యిస్కూలులో వదిలిపెట్టిరా" అంది.

భార్య మాటలు విన్న పెంటయ్య అమ్మాయి తీసుకొని యిస్కూలుకు వెళ్లాడు.

ఇస్కూలులో అప్పుడే గణగణమని గంట కొడుతున్నారు.

గంట వినగానే పిల్లలు తరగతిలో నిలబడి, వందేమాతరం ఆలాపించారు. ప్రార్థన కార్యక్రమాలు అయిన తరువాత పిల్లలు నిశ్శబ్దంగా బల్లలపై కూర్చున్నారు.

అంతలో పెంటయ్య "దండాలు పంతులమ్మగారూ! మా పిల్లను యిస్కూలులో చేర్పిద్దామని వచ్చా" అన్నాడు పెంటయ్య వినయంగా.

పంతులమ్మ ఆ అమ్మాయి వివరాలు అడ్మిషన్ ఫారంలో నింపడానికి "అమ్మాయి పేరేంటి?" అని అడిగింది.

"అమ్మాయిపేరు సుశీల అండీ"

"తండ్రి పేరు?" అడిగింది.

వెంటనే "పెంటయ్య" అన్నాడు. ఆ పేరు వినగానే తరగతిలోని పిల్లలందరు పకపకా నవ్వారు.

పెంటయ్య మళ్లీ "ఔనమ్మా! నా పేరు పెంటయ్య అని మా అమ్మనాన్నోళ్లు పెట్టారు" అన్నాడు అమాయకంగా.

పంతులమ్మ ముసిముసి నవ్వులు



నవ్వుకుంటూ "అమ్మాయి పుట్టిన తేది తెలుసా?" అంది.

"తెలువదమ్మా. దానికి యిపుడు ఐదో సంవత్సరం" అన్నాడు.

"సరేలే.. నేను పుట్టిన తేది రాసుకుంటాను. ఈ ఫారంలో సంతకం పెట్టు" మన్నది పంతులమ్మ.

దానికి "అమ్మగోరూ.. నాకు సంతకం వస్తే నేను యిట్లా వుంటానా? వేలిముద్ర వేస్తా" నన్నాడు.

పంతులమ్మ నవ్వుకుంటూ వేలిముద్ర వేయించి, పెంటయ్య అని రాసి- "సరే.. నీవు వెళ్లు. రేపటి నుంచి పాపను రోజూ తప్పకుండా స్కూలుకు పంపు" అంది.

పెంటయ్య పంతులమ్మకు దండం పెట్టి, పాపను స్కూల్లో వదిలి యింటికి పోయాడు.

ఐదు వసంతాలు గడిచిపోయాయి. సుశీల యిప్పుడు ఐదవ తరగతి చదువుతోంది. సుశీల చురుకైన పిల్ల బాగా చదువుతూ పిల్లలందరిలోకి మంచి మార్కులు తెచ్చుకొనేది.

వర్షాకాలం ప్రారంభానికి సూచనగా అప్పుడప్పుడు ఆకాశం మేఘాలు కమ్ముకొని సన్నని తుంపర రాలుతోంది.

"ఏమయ్యో! వచ్చేది వానాకాలం. పొయ్యిలోకి కట్టెలు లేవు. అడవికి పోయి కాసి ఎండుకట్టెలు తీసుకొనిరా" అంది.

భార్య మాట విని పెంటమ్మ కట్టెల కోసం అడవికి పోయి కట్టెలు కొడ్తుంటే నాగుపాము కాటు వేసింది.

పెంటయ్య 'అబ్బా!' అంటూ నురగలు కక్కుతూ పడిపోయాడు.

తోటివాళ్లు చూసి పెంటయ్యను గూడేనికి మోసుకొచ్చారు.

పెంటమ్మ "ఏమిట్రెంది మా ఆయనకు, ఎందుకు మోసుకొచ్చారని" ఆదుర్దాగా అడిగింది.

వాళ్లు జరిగిన సంగతి చెప్పి, అడవి వైద్యమైన పసర్లు, మంత్రాలతో ఆలస్యం చేసారు.

పెంటయ్య చనిపోయాడు. పెంటమ్మ దుఃఖానికి అంతులేదు, భర్త దేహంపై పడి రోదించసాగింది. జనం గుమికూడి సానుభూతి మాటలు చెప్తున్నారు.

అంతలో బడి వదిలారు. సుశీల సంచి సంకకు తగిలించుకొని పరుగెత్తుకుంటూ యింటి దారిపట్టింది.

ఇంటి దగ్గర జనం గుమిగూడి వున్నారు. సుశీల లోపలికి తొంగిచూసింది. తండ్రిని కింద పడుకోబెట్టారు. అమ్మ రోదిస్తోంది. ఆ దృశ్యాన్ని చూసిన సుశీల అయ్యా..! అంటూ పెంటయ్య శవంపై పడిపోయింది.

ఆ పాపను ఆపటం ఎవరి వశం కాలేదు. భార్యను, పాపను ఓదార్చి పెంటయ్యకు అంత్యక్రియలు జరిపించారు గూడెంవాసులు.
సుశీల ఐదవ తరగతి మంచి మార్కులతో పాస్ అయింది. ఒకరోజు పంతులమ్మ పెంటమ్మ దగ్గరకు వచ్చింది. "అమ్మా, మీ అమ్మాయి చాలా చురుకైన, తెలివిగల పిల్ల. ఆ అమ్మాయికి మంచి భవిష్యత్తు ఉంది, పై చదువులు చదివించండి" అంది.
ఆ మాటలకు పెంటమ్మ "అమ్మా! మేం పేదవాళ్లం. రెక్కాడితేగానీ డొక్కాడని బడుగుజీవులం. అందులో తండ్రి లేని పిల్ల వేరే ఊరికి పంపి చదివించే బలం మాకు లేదమ్మా" అంది, పెంటమ్మ.
పంతులమ్మ "చదువు గురించి మీరు ఏమీ ఖర్చు చేయనవసరం లేదు. గిరిజన గురుకుల పాఠశాలలో నేను చేర్పిస్తాను. ఆరు నుంచి పదవ తరగతి వరకు, వసతి, భోజన సదుపాయమే కాకుండా బట్టలు, పుస్తకాలు అన్నీ ఆ పాఠశాలవారే భరించి చదువు చెప్తారు. మీరు సరేనంటే నేను రేపే అమ్మాయిని పాఠశాలలో చేర్పిస్తానని" చెప్పి, ఒప్పించి సుశీలను గిరిజన గురుకుల పాఠశాలలో చేర్పించింది.
సుశీల శ్రద్ధగా చదివి, అంచెలంచెలుగా ఎదిగి పదవ తరగతి పరీక్షలలో పదికి పది ర్యాంకు సంపాదించి మొదటి శ్రేణిలో నిలిచింది.
పదవ తరగతిలో ఆమె ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర అభివృద్ధి గురించి ఇంగ్లీషులో అనర్గళంగా ఉపన్యసించి, ముఖ్యమంత్రి, సభికుల ప్రశంసలు అందుకుంది.
సత్కారం చేసినప్పుడు ముఖ్యమంత్రి గారిని వినయపూర్వకంగా "సార్! నాకు బదులు మా అమ్మగారికి మీ చేతుల మీదుగా సన్మానం" చేయండన్నది సుశీల.
సుశీల అభ్యర్థనను అంగీకరించిన ముఖ్యమంత్రి ఆ అమ్మాయికి బదులుగా పెంటమ్మను శాలువతో సత్కరించి, పది వేల రూపాయలు నగదు బహూకరించారు. పెంటమ్మ ఆనందంతో పులకించి ఆనంద భాష్పాలు రాల్చింది. తల్లీ, కూతురు ఆనందంతో గూడేనికి చేరారు. సుశీలకు పై చదువులు చదవాలని వుంది. కానీ అమ్మ ఆరోగ్య పరిస్థితి తిండికి అర్రులు చాచే పరిస్థితి చూసి, చదువును వదలి ఏదైనా ఉద్యోగం సంపాదించి, అమ్మను బాగా చూసుకోవాలి. తరువాత అయినా ప్రైవేటుగా పై చదువులు చదవవచ్చు.. అని భావించి సుశీల హోమ్‌గార్డు ఉద్యోగంలో చేరి, డ్యూటీ చేయసాగింది.
డ్యూటీలో చేరిన తరువాత తనకు నియమించిన మార్కాపురం పట్టణానికి అమ్మను తీసుకొనిపోయి కాపురం పెట్టింది. ఆ క్రమంలోనే తన సహచర ఉద్యోగిని యిష్టపడి అమ్మ అనుమతితో పెళ్లి చేసుకుంది.
కొన్ని రోజులు వారి సంసార జీవితం సాఫీగా జరిగింది. ఒక అమ్మాయి పుట్టింది. అమ్మాయి పుట్టిన రెండు మూడు సంవత్సరాల తరువాత భర్త వదిలిపెట్టి వెళ్లిపోయాడు.
సుశీల భర్త మీద కేసులు పెట్టకుండా ఇష్టం లేకే కదా వదిలివెళ్లింది. అటువంటి వారిని చేరనీయకూడదు. అతని పాపానికి అతనిని వదిలివేసి, పాపను గారాబంగా పెంచసాగింది.
అమ్మాయి సాయిలక్ష్మి ఆరవ తరగతి చదువుతుంది. కానీ రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించి, బలహీనంగా మారసాగింది. ఆ అమ్మాయి ఆరోగ్య పరిస్థితిని చూసి కలత చెందిన సుశీల ప్రముఖ వైద్యశాలలో చూపించింది. డాక్టర్లు చెప్పిన మాటలు విని అవాక్కై పోయింది "పాపకు కాలేయ కేన్సర్ ముదిరిపోయింది. మందులు వాడండి, ఏ విషయం చెప్పలేమని" చెప్పి మందులు రాసి యిచ్చి యింటికి పంపించేశారు.
అమ్మాయి పరిస్థితి చూసి సుశీల చలించిపోయింది. అమ్మాయి యిక కొన్ని రోజుల అతిథి మాత్రమే చనిపోవడం ఖాయమన్న భావం ఆమె గుండెను కదిలించి వేసింది. ఒంటరిగా కూర్చొని రోదించింది, విలపించింది. మనసును కుదుట పరచుకొని రోజులు లెక్కిస్తుంది.
కరోనా మహమ్మారి ప్రపంచాన్ని ముట్టడించి, దేశాలకు దేశాలనే అతలాకుతలం చేయసాగింది.
ఆ తరుణంలో ప్రజలను లాక్‌డౌన్ కాలంలో వీధులలో తిరగకుండా కట్టడి చేయడానికి పోలీసులతో పాటు సుశీల కూడా డ్యూటీ చేయసాగింది.
రోజులాగానే ఆ రోజు తెల్లవారింది. సుశీల మనసును ఏదో శంక వెంటాడసాగింది. ఆ శంకతో విచారంగా హోమ్‌గార్డు డ్రస్సు వేసుకొని మంచం మీద నిస్సత్తువగా పడి వున్న పాప దగ్గరకు వచ్చింది. "అమ్మా! సాయి.. నేను డ్యూటీకి వెళ్తున్నా" అని పలకరించింది.
సాయిలక్ష్మి అమ్మచేయి పట్టుకుంది.

సుశీల శ్రద్ధగా చదివి, అంచెలంచెలుగా ఎదిగి పదవ తరగతి పరీక్షలలో పదికి పది ర్యాంకు సంపాదించి మొదటి శ్రేణిలో నిలిచింది.పదవ తరగతిలో ఆమె ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది.

"అమ్మా! నేను మరలా బాగౌతానా? నన్ను మంచి డాక్టరుకు చూపించమ్మా! నేను కోలుకున్న తరువాత స్కూలుకు వెళతాను. బాగా చదువుకుంటానని" చెప్పసాగింది. కూతరి మాటలు విని ఆమె చలించిపోయింది. ఆ అమ్మాయి కోర్కెను తీర్చలేని నిస్సహాయురాలిని అని కుమిలి కుమిలి మనసులో రోదించింది. ఆ రోదనకు గుర్తుగా కళ్ల నుండి కన్నీళ్లు కారసాగాయి.
పాప "అమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు? ఏడవవద్దు, ధైర్యంగా వుండమని" చెప్పింది.
సుశీల ఇక అక్కడ ఒక్క క్షణం కూడా వుండలేక పాప తల మీద చేయి పెట్టి దీవించి, వస్తానని చెప్పి డ్యూటీకి వెళ్లిపోయింది.
మధ్యాహ్నం వరకు డ్యూటీ చేస్తోందిగానీ తన ధ్యాసంతా తన ఫోను పైనే ఉంది. ఎక్కడెక్కడి నుంచో ఫోన్లు వస్తున్నాయి. వాటికి సమాధానాలు చెప్తోంది. చివరికి ఇంటి నుంచి ఫోను రానే వచ్చింది. ఆదుర్దాగా ఫోన్ ఎత్తింది.
అవతలి వైపు నుంచి "త్వరగా బయలు దేరి ఇంటికి రా" అని ఫోను పెట్టేశారు. సుశీల డ్యూటీ ముగించుకుని ఆదుర్దాగా యింటికి బయలుదేరింది.
ఇంటి ముందు జనం గుమిగూడి వున్నారు. జరగరానిదేదో జరిగిందని భావించి, లోపలికి వచ్చింది. తన ముద్దుల కూతురు మంచంపై అచేతనంగా పడి వుంది. అమ్మా... అంటూ రోదిస్తూ సాయి శరీరం పడిపోయి కన్నీళ్లు అయిపోయేవరకు రోదించింది.

పాప చెప్పిన చివరి మాటలు, “అమ్మా! నన్ను పెద్ద డాక్టర్లకు చూపించు, నేను కోలుకున్న తరువాత స్కూలుకు పోతాను, నీకు మంచి పేరు తెస్తానమ్మా” అంటూ చివరి కోరిక కోరింది పిచ్చి సాయి.. నా తల్లి కోరికను నెరవేర్చలేని అసహాయురాలినని వెక్కి వెక్కి ఏడ్చింది.

బంధువులు, చుట్టుపక్కలవారు ఆమెను సముదాయించారు.

ఆ సాయంత్రమే పాప సాయి అంత్యక్రియలు జరిగిపోయాయి.

రాత్రి ఆకాశం నల్లని ముసుగు వేసుకొని దయ్యంలా జడిపిస్తుంది. దూరాన ఊరకుక్కలు మోరలు పైకెత్తి విషాద గీతాలు ఆలపిస్తున్నాయి.

ఆ భయంకర కాళరాత్రిలో అమ్మతో పాటు పడుకున్న సుశీలకు నిదుర రాలేదు.

పాప చెప్పిన చివరి మాటలు, “అమ్మా! నన్ను పెద్ద డాక్టర్లకు చూపించు, నేను కోలుకున్న తరువాత స్కూలుకు పోతాను, నీకు మంచి పేరు తెస్తానమ్మా” అంటూ చివరి కోరిక కోరింది పిచ్చి సాయి.. నా తల్లి కోరికను నెరవేర్చలేని అసహాయురాలినని వెక్కి వెక్కి ఏడ్చింది.

సుశీల ఏడ్పుకు పెంటమ్మ మేలుకుంది. కూతురిని ఓదార్చి అక్కున చేర్చుకుంది. రాత్రి గడిచిపోయింది.

తెల్లవారి మంచంపై చూసింది.. మంచం ఖాళీగా అచేతనంగా పడి వుంది. పాప కనుల ముందు కదలాడింది.

కన్నీళ్ల తుడుచుకుని యూనిఫామ్ వేసుకొని యథాప్రకారం డ్యూటీకి వెళ్లింది.

మునుపటిలాగానే పట్టుదలతో డ్యూటీలో నిమగ్నమైంది.

ఆరోజు పట్టణ డి.యస్.పి. తనిఖీ చేస్తూ అటు వైపు వచ్చాడు. డ్యూటీలో వున్న హోమ్‌గార్డ్ సుశీలను చూసి ఆశ్చర్యపోయాడు.

నిన్న కూతురు చనిపోతే సెలవు పెట్టకుండా అంత బాధలోనూ డ్యూటికి వచ్చిన సుశీలను చూసి జీపు దిగి వచ్చి డియస్‌పి సెల్యూట్ చేశారు.

“నీవు ఇంత దుఃఖంలోనూ.. ఈ విపత్కర పరిస్థితుల్లో నీ కర్తవ్యం నిర్వహించడానికి వచ్చిన నీకు వేల వందనాలు” అంటూ ఆమెను ప్రశంసించి వెళ్లిపోయాడు.

“హోమ్‌గార్డ్‌కు సెల్యూట్ చేసిన డి.యస్.పి” అనే వార్త ప్రముఖ పత్రికలలో పెద్ద పెద్ద అక్షరాలతో ప్రచురించారు.

ఆ వార్తను చూసిన ముఖ్యమంత్రి ఆమెను అభినందిస్తూ ట్విట్టర్‌లో పోస్టు చేశాడు.

సుశీల తన కర్తవ్యం నిర్వహించేందుకు గర్వంతో దేశానికి సెల్యూట్ చేసింది. ■

### వింతలకు నిలయం సహారా ఎడారి

**(7వ పేజీ తరువాయి)**

చేయడానికి దీనిని నిర్మించారు. ఈ మొత్తం రైలుమార్గం పొడవు 704 కి.మీ. ఈ రైలుబండి పొడవు 3 కి.మీ. ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత పొడవైన, బరువైన రైలుబండి.

మారిటాన్ ప్రాంతమంతా ఇసుకతిన్నెలతో నిండి ఉంటుంది. ఈ ప్రాంతంలో 0.2 శాతం భూభాగం మాత్రమే వ్యవసాయ యోగ్యం కాగా ప్రజలంతా సమీపంలోని నోవాక్‌చోట్ ప్రాంతానికి వలస వెళ్లారు. దాంతో 1980లో కేవలం ఎనిమిది వేలు మాత్రమే ఉన్న ఈ నగర జనాభా నేడు ఏకంగా పది లక్షలకు చేరుకుంది. ఈ ప్రాంతంలో భూగర్భంలో లభించిన ప్రకృతి సంపదను ఈ రైలు ద్వారా సముద్ర తీరానికి చేరుస్తారు. ఈ రైలు కనుచూపు మేరకు కనబడనంత పొడవుగా ఉండి ఒకేసారి 17 వేల టన్నుల ఇనుప ధాతువులను సముద్ర తీరానికి చేరుస్తుంది. నాలుగు డీజిల్ ఇంజన్ల సాయంతో ఈ రైలు 200 నుండి 220 బోగీలతో ముందుకు సాగుతుంది. ఒక్కో బోగీ 84 టన్నుల ఇనుప ధాతువును తరలించే సామర్థ్యాన్ని కలిగి వుంటుంది. ఈ రైలు ద్వారా ఏడాదికి 16.6 మిలియన్ల టన్నుల ఇనుప ధాతువును తరలిస్తారు.

సహారా ప్రాంతంలోని సముద్ర జలాలలో చేపలు విరివిగా లభిస్తాయి. జాలర్లు ఈ రైలుబండిలో ఎక్కి సముద్ర తీరానికి చేరి చేపలను వేటాడి, అమ్ముకుని జీవిస్తుంటారు. ఎడారిలో అక్కడక్కడా కనిపించే గ్రామ ప్రజల అవసరార్థం మంచినీళ్ళ, ఇంధనాలు ఈ రైలు ద్వారానే అందుతాయి. కొన్ని సందర్భాలలో ఈ రైలు పైభాగంలో కూర్చుని ప్రజలు ప్రయాణిస్తూ కింద పడి చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.



### పర్యాటకుల బస

సహారాలో టెంట్లతో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని పర్యాటకులు బస చేసి వింత అనుభూతిని పొందుతారు. సహారా ఎడారిలో చేయగలిగే ముఖ్యమైన అనుభవాలలో ఒకటి రాత్రి కచ్చితంగా ఇక్కడ గడపడం... నక్షత్రాల కింద నిద్రించడం. సహారాలో రాత్రిపూట గడిపి చీకట్లో నక్షత్రాలను తిలకించే అనుభూతి కోసం పలు దేశాల పర్యాటకులు ఆసక్తి కనబరుస్తారు.

ఈ ఎడారిలో పర్యాటకులు ఒంటెలపై స్వారీ చేస్తూ విహరించడం మరిచిపోని, మరువరాని తీపి జ్ఞాపకంగా భావిస్తారు.

ఇసుక తిన్నెలపై మోటారు వాహనాలపై విన్యాసాలు చేస్తూ ప్రయాణించడం మరో అనుభూతి ప్రేమ జంటలు ఇసుక తిన్నెలపై చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతారు.

సహారా ఎడారి సమీపంలో చూడదగిన ప్రదేశాలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతంలో మొరాకో ఒక అందమైన నగరం. ఈ నగరంలో కేఫ్‌లు, షాపులు ఉన్న అల్ మొహిదిన్ స్క్వేర్‌ను కూడా చూడవచ్చు.

ప్రపంచంలో అతి పెద్ద ఎడారి సహారా ఎడారి. ఆఫ్రికా ఖండంలో సగం దాకా ఇది విస్తరించి ఉంది. అక్కడ అత్యధిక వేడిగాలులతో కూడిన వాతావరణం ఉంటుంది.

ఇటీవల జరిపిన పరిశోధనలలో తెలిసిందేమిటంటే సహారా ఎడారిలో సోలార్ ప్యానల్స్ అమర్చడం వల్ల ఈ ప్రపంచానికి కావాల్సిన విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌లను కూడా రూపొందించారు.

ఇటువంటి ప్రయోగాలు, ఆలోచనలు కార్యరూపం దాలిస్తే మానవాళికి చక్కటి మేలు జరుగుతుంది. ❑

సాహిత్యం

# తెలంగాణ సాహితీ వైభవం



ఏ కాలంలో అయినా నాటి సామాజిక సంక్షోభాలు, దుస్థితి రచయితలు, కళాకారులు, కవుల హృదయాలను తీవ్రంగా స్పందింపచేసి సంచలనం కలిగిస్తేనే సాహిత్యం నాలుగు కాలాలు నిలిచేదిగా ఉత్తమ ప్రతిభను వివిధ ప్రక్రియలలో సృష్టించగలుగుతుంది. తెలుగునాట అటు, యిటు కూడా సంప్రదాయం నుంచి ఆధునికత వరకు సాహిత్యం వివిధ పరిణామ దశలలో వెల్లివిరిసింది. తెలంగాణ సాహితీ వికాసం పరిశీలిస్తే, సంప్రదాయక రూపమైన పద్యం నుంచి ప్రస్తుత కవిత, పాట, యితర వచన వివిధ కవితా సాహితీ ప్రక్రియలలో, భిన్నమైన సంచలనాలు హృద్యంగా స్పష్టమవుతున్నాయి. నిజాం రాచరిక పాలన, రైతాంగ విమోచనోద్యమాలు, సాయుధ పోరాటాలు, అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాలు కవి, పండితులను కదిలించి, కొందరికి వారి జీవితమే సాహిత్యంగా ఆ తీవ్ర భావజాలమే సర్వస్వంగా నడిపిస్తోంది.

ముఖ్యంగా తెలంగాణ పాటలో సామాజిక విప్లవ భావనలు పెల్లుబికి ప్రజల భావోద్వేగాలు ప్రజ్వరిల్లాయి. 354 మంది కవి పండితులతో, వారి రచనలతో సురవరం ప్రతాపరెడ్డిగారు రూపొందించిన 'గోలకొండ కవుల సంచిక' తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. తెలంగాణలో మొదటి నవల తడకమల్ల కృష్ణారావు రచించిన 'కంబురకందర చరిత్ర' లోకమలహరి రాసిన 'జగ్గనియిద్దె' నవల దళిత జీవితానికి అద్దం పట్టింది. మొదటి చారిత్రక నవల ఒద్దిరాజు రామచంద్రరావు రచించిన 'రుద్రమదేవి', తెలంగాణ విమోచనోద్యమాన్ని ప్రతిఫలింపచేసిన నవలలు వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', 'గంగు' వంటి నవలలు, దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్లు' ఎందరో రచయితలు, కవులు సమాజాన్ని ఎంతగానో ప్రతిబింబింపచేసారు. దాశరథి, కాళోజీ, సుద్దాల హనుమంతు, యాదగిరి, పొట్లపల్లి రామారావు, గంగుల శాయిరెడ్డి, వానమామలై సోదరులు మరెందరో ప్రజల జీవన భావోద్వేగాలకు అనుగుణంగా కలాలు కదిలించారు, జైళ్ల పాలయ్యారు. వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన జైలుకథలు, తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా జైలుజీవితాన్ని కళ్లకు కట్టించాయి. పి.వి.నరసింహారావు రాసిన గొల్లరామవ్వ, భాగ్యరెడ్డి వర్మ 'వ్యక్తి మాదిగ', సురవరం ప్రతాపరెడ్డి 'సంఘాల పంతులు' యివన్నీ మచ్చుకు మాత్రమే. యింకా ఎంతో సాహిత్యం వుంది.

ఇక శతక ప్రక్రియలోను, పద సంకీర్తన, అంతకుముందు యక్షగానాలు, అపారమైన జానపద సంస్కృతి ఆధారంగా మౌఖిక కవిత్వం వెల్లివిరిసింది. శ్రమశక్తి, దోపిడీ, రాజ్యాధికారం సృష్టిస్తున్న హింసా, దౌష్ట్య, అణచివేతలు సామాజిక హితం, పీడిత జనావళి బతుకుల కోసం కలాలు ఆయుధాలుగా, ఝుళిపిస్తూనే ఉన్నారు. సామాజిక విప్లవం నినాదంగా తెలంగాణ సీమలో గత అర్ధ శతాబ్దిగా ఎందరో ప్రజా కళాకారులు, తమ రచనలు కవిత్వం, కథ, ముఖ్యంగా పాట వంటి ప్రక్రియలతో రణ నినాదం కొనసాగుతూనే వుంది. గోల్కొండ బందిఖానాలో తన ఆధ్యాత్మిక అనుభవాల సంకీర్తనలతో భక్తరామదాసు వేదనాయుతంగా శ్రీరామచంద్రుణ్ణి ప్రశ్నించిన సంప్రదాయ నైతికత తెలంగాణ సీమకు ఒరవడిగా చరిత్ర సృష్టించింది.

భాషా ప్రక్రియల్లో, శతక సాహిత్యానికి తెలంగాణ ప్రత్యేక వైదుష్యం, విలక్షణత తార్కాణంగా గుర్తింపు పొందింది. బద్దెన సుమతీ శతకం, రామదాసు దాశరథీ శతకం, శేషప్పకవి నరసింహ శతకం, బమ్మెర పోతన నారాయణ శతకం, నరసింహ శతకం, పాల్కురికి వృషాధిప శతకం, ఎలకూచి బాలసరస్వతి మల్లభూపాలీయం ఉత్పల సత్యనారాయణాచార్య ఉత్పలమాల తమ కావ్య రచనా ప్రస్థానంలో నాడూ నేడూ శతక పద్య ముత్యాలను ప్రతిభావంతంగా రచిస్తున్నారు.

**"కోటి తెలుగుల బంగారు**
**కొండ క్రింద**
**పరచుకొన్నట్టి సరసులోపల**
**వసించి**
**ప్రొద్దు ప్రొద్దున అందాల**
**పూలు పూయు**
**నా తెలంగాణ తల్లి కంజాత**
**వల్లి"**
**నా తెలంగాణ కోటి అందాల**

జాణ అంటూ డా॥ దాశరథి మూగవోయిన కోటి తమ్ముల గళాల పాట పలికించి కవితా జవమ్ము కూర్చి నా కలానికి బలమిచ్చి నడిపినట్టి నా తెలంగాణ కోటి రత్నాల వీణ అన్నారు. తొలి తెలుగు శతకం, ద్విపద కావ్యం, ఉదాహరణ కావ్యం, లక్షణ గ్రంథం, ద్విపద రామాయణం, చంపూ రామాయణం, దండకం, సంకలన కావ్యం, యక్షగానం, కథాకావ్యం, చారిత్రక గ్రంథాలు, తెలుగు కందపద్యం, అవధానం, గజల్, సీస పద్య శతకం, హాలుని గాథా సప్తశతి వంటి తొలి గాథా సంకలన కావ్యాలుగా నాటి నుంచి నేటి వరకు తెలంగాణ సాహితీ వైభవంపై మరింత శోధన, పరిశోధనాత్మక లోచూపు, నిరంతర అన్వేషణతో, ఎన్నో మణిదీపాల వెన్నెల వెలుగులను తెలుగు సాహిత్యంపై మరింత ప్రసరింపచేయగలదు.

**- జయసూర్య**


# ఇది కథ కాదు

**సింగంపల్లి శేష సాయికుమార్**

**ఊరంతా ఒకటే హడావిడి.. ఎక్కడెక్కడి నుండో కార్లు వచ్చి ఏటిగట్టున ఆగుతున్నాయి. ఎవరెవరో పెద్ద పెద్ద ఆఫీసర్లు టేపులు గట్రా పెట్టుకొని కొలతలు తీస్తున్నారు.**

“ఈ రోడ్డు ఆ గట్టు మొదలు కొండ చుట్టూ ఏటి మధ్యలోంచి రావాలి. ఆ తరువాత ఇవతలి వైపు కనపడే ఆ ఊరికి సరిగ్గా ఒకటిన్నర కిలోమీటరు రావాలి, ఏమాత్రం తేడా రాకూడదు ప్లాన్ పక్కాగా తీయండి” అంటూ పెద్దాయన అందరినీ చక్కబెడుతున్నారు.

ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు ఏకిలపల్లె వాసులకి. ఒకరిద్దరు భుజాన తువాలు వేసుకొని వారి మాటలు సైగగా వింటూ ఏదో అర్థం అయినట్లుగా తెగ తల ఊపుకుంటున్నారు.



ఇంతలో అక్కడకు వచ్చాడు సారయ్య, ఊరికి పెద్ద పెద్ద పనులు చేద్దాం అనుకుని చేయలేక ఎవరైనా చేయకపోతారా? అని చూస్తున్న మంచి మనిషి. పక్కనే టోపీ పెట్టుకున్న ఆఫీసరు దగ్గరకెళ్లి “సార్! మా ఊరికి రోడ్డుపనికి కొలతలు తీస్తున్నారా? పోయినసారి తీసారు కదా, ఇప్పుడు మళ్లీ ఎందుకు?” అంటూ వారి పనిలో తన పనిని కూడా కానిచ్చేస్తున్నాడు.

“ఏం లేదయ్యా, ఈసారి మీ ఊరికి నిజంగా రోడ్డు పడేటట్లుంది. సెంట్రల్ నుండి ఒక పెద్ద ఆఫీసరు మంత్రిగారికి బాగా గట్టిగా చెప్పి రోడ్డుకు కాంట్రాక్టు కూడా ఇప్పించేసారు. ఇంకేముంది! గట్టిగా ఓ నాలుగైదు నెలలో రోడ్డు పనులు అవుతాయి” అంటూ టక్కు సరిచేస్తున్నాడు.

ఇలా మొదలైందో లేదో కానీ నాలుగు నెలలు కాస్తా ఆరు నెలలకు వచ్చేసింది. ఏకిలపల్లె నుండి రోడ్డు ఏట్లోగుండా సుందరంగా తయారై కూర్చొంది. అందరూ ఇంకా భ్రమలోనే ఉన్నారు.

“పేపర్లో పెద్ద పెద్ద అడ్వర్టైజ్‌మెంటు.. మంత్రిగారు వచ్చే నెల 15వ తేదీ రోడ్డు ప్రారంభిస్తున్నారు” అని. దాని పక్కనే గ్రామ ప్రజలు ఆనందంగా ఉన్న ఫోటో రెండూ తెగ చూడముచ్చటేస్తోంది.

రోడ్డు ప్రారంభానికి సిద్ధం అయిపోయింది. అధికారులు మంత్రి రాక కోసం ఎదురు చూస్తున్నారు. కార్లో నుండి మంత్రిగారు ఆయనతో పాటు ఓ యువ ఆఫీసరు ఎక్కడో చూసినట్టుంది ఆ ఊరివాళ్లకు. కానీ ఎంతకూ గుర్తుకు రావడం లేదు. మైక్‌లో రోడ్డు ప్రారంభించడానికి మంత్రిగారిని పిలిచారు.

మంత్రిగారు మైకందుకొని “ఇప్పుడు ఇది ఓపెన్ చేసేది నేను కాదు మీ ఊళ్లో ఉండే సుబ్బయ్యవ్వ, ఆమె భర్త వెంకయ్య ఇద్దరూ త్వరగా ఇక్కడికి రావాలి. ఇది నా కోరిక కాదు, ఇదుగో ఇక్కడున్నారే ఈ ఆఫీసరుది. ఈయన మన పక్కఊరివాడే. ఆయనే ఎందుకో వాళ్లతో ఓపెన్ చేయించాలనుకుంటున్నారు, త్వరగా రావాలి” అంటూ జనం వైపు చూస్తుంటే–

వారిలో నుంచి ఏం జరుగుతోందో అర్థంకాక ఒక వైపు, అందరూ ముందుకు తోస్తుంటే మరొక వైపు ముందుకు వస్తున్నారు ముసలోళ్లు.

వచ్చి రాగానే “తాతా! ఇంద కత్తెర, ఈ రిబ్బన్ కత్తిరించు” అంటూ చేతికిచ్చాడు ఆఫీసరు.

రిబ్బన్ కత్తిరించి ఏమీ జరుగుతోందో అర్థంకాక నిలుచున్నారు ఇద్దరు.

వాళ్లను అక్కడ కూర్చోబెట్టి “మీలో చాలా మందికి మా అమ్మా నాన్నా తెలిసుంటారు. మాది మీ పక్కన ఉండే ఊరే. నేను స్కూల్లో చదువుకునేటప్పుడు సుబ్బయ్యవ్వ హోటలుకు తినేదానికి వెళ్లేవాళ్లం. ఆమె మా దగ్గర డబ్బులున్నా, లేకున్నా ఒక్కోరోజు దోశలు పెట్టేది. ఈ వెంకయ్యతాత మేం తింటుంటే ఒక్కోరోజు ఒక్కో కథ చెప్పేవాడు”.

“పిల్లోల్లకు కథలెందుకు చెబుతున్నావు? అని నీ వ్యాపారం బాగా చేసుకోవడానికా” అని ఎందరో మా ముందే అనేవాళ్లు. కానీ నాకు పై చదువులు చదివాక అర్థమైంది ఆయన చెప్పే కథలన్నీ ఈ ఊరివాళ్ల కష్టాలు, బాధలని. అవి తీరిపోతే ఎలా ఉంటాయో అల్లి మరీ చెప్పేవారు.

కథలు మనుషుల్ని మార్చేయవు. కానీ కథలు ఒక్కో కొత్త కథల్ని జీవితంలో పుట్టిస్తుంటాయి. వాటిలో మనం పాత్రధారులం. ఆయన చదువుకోకపోయినా నా లాంటి ఒకడి మెదడులో ఆలోచనలు పుట్టించాడు. అలాంటి వ్యక్తి చేత ఇలా ఓపెన్ చేయించడం మంచిదేగా” అంటూ నిశ్శబ్దానికి తలుపులు వేద్దాం అనుకున్నాడు.

కానీ ఒకటే చప్పట్లు..

కొండప్రాంతం అంతా కోకిలలు పాడినట్లు అయిపోయింది. నీళ్ల లేని ఏరు కాస్త దప్పిక తీరినట్లు చల్లబడిపోయింది.

ఇదంతా అయిపోయినా తాత ఏమాత్రం మళ్లీ కథలు పుట్టిస్తూనే ఉన్నాడు. కథల నుంచి కొత్త తరానికి కలలు తెప్పిస్తూనే ఉన్నాడు. ❑



# దుకాణాలకు వాస్తు వర్తిస్తుందా?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**

**సెల్స్: 9885446501/9885449458**




**దుకాణం కోసం ఏదయినా హాలునుగానీ, స్థలాన్నిగానీ తీసుకునే ముందు జాగ్రత్తపడడం వల్ల అనేక ఇబ్బందుల నుండి తప్పించుకోవచ్చు. దుకాణం చతురస్రాకారంగాగానీ, దీర్ఘ చతురస్రాకారంగా గానీ వుండేట్లు చూసి తీసుకోవాలి.**

ఈశాన్యం మూలలో తూర్పు ఈశాన్యంగానీ, ఉత్తర ఈశాన్యంగానీ పెరిగి వుంటే మంచిది. ఉత్తర ఈశాన్యం పెరిగినట్లయితే ఈ వాయువ్యం సరిగ్గా 90 డిగ్రీలు వుంటే అతి శ్రేష్ఠమైంది. అలాగే తూర్పు ఈశాన్యం పెరిగితే ఆగ్నేయం 90 డిగ్రీలు వుంటే కూడా అతి శ్రేష్ఠమైంది. ఈశాన్యం తప్ప వేరే ఏ మూలలూ పెరగకుండా వుంటే స్థలాన్ని లేదా హాలును దుకాణం కోసం తీసుకోవచ్చు.

దుకాణానికి వున్న నాలుగు భుజాలు నాలుగు దిక్కులకు అమరేలా వుండాలి. దుకాణ మూలలు దిక్కులను చూస్తున్నట్లు వుండకూడదు.

స్థలంలో దుకాణం కట్టేటప్పుడు నేల విషయంలో చాలా జాగ్రత్త వహించాలి. ఫ్లోరింగ్ వేసేటప్పుడు దక్షిణం నుండి ఉత్తరానికి పశ్చిమం నుండి తూర్పుకు వాలు వచ్చేలా జాగ్రత్త పడితే ఈశాన్య పల్లం ఏర్పడుతుంది. ఈశాన్యం కంటే వాయువ్యం ఎత్తుగా వుండాలి; వాయువ్యం కంటే ఆగ్నేయం; ఆగ్నేయం కంటే నైరుతి ఎత్తుగా వుండేలా ఫ్లోరింగ్ నిర్మాణం చేయాలి.

అవకాశం ఉంటే ఉత్తర ఈశాన్యంలోగానీ తూర్పు ఈశాన్యంలోగానీ చిన్న తూము ఏర్పరచి ఫ్లోర్లు కడిగిన నీళ్లు అటుగా ప్రవహించేలా చేయడం వల్ల వాస్తు సహకారం లభిస్తుంది.

ఈశాన్యంలో తూము పెట్టలేని పరిస్థితిలో అంటే వాడుకనీరు ఈశాన్యం నుండి వెళ్లేందుకు పైపులైను అమర్చలేని విధంగా దుకాణం వుంటే– తూర్పు ఈశాన్యపు భాగంలోగానీ, ఉత్తర ఈశాన్యపు భాగంలోగానీ నేల మీద నుండి గోడ అవతలి పక్కవరకూ ఒక చిన్న రంధ్రాన్ని చేసి వదిలేయాలి. రంధ్ర వ్యాసం కనీసం అంగుళమైనా వుండాలి. ఈ రంధ్రాన్ని/తూమును ఏదయినా ఈశాన్య భాగంలో నిర్మించాలి.

దుకాణాల్లో అమర్చే సరుకులు మొదలయినవి అధిక భాగం బరువయినవి పశ్చిమ దక్షిణ గోడలకు ఆనుకుని వుండేలా చూసుకోవాలి. తూర్పు, ఉత్తరాల్లో ఏమీ పెట్టకుండా ఖాళీ స్థలం వదలడం చాలా మంచిది. అయితే దుకాణాల్లో ప్రతి చదరపు అంగుళమూ ఎంతో పొదుపుగా వాడుకోవాల్సి వస్తున్న ఈ రోజుల్లో అది సాధ్యమయ్యే పని కాదు. బాగా రద్దీగా వుండే మార్కెట్ స్థలాల్లో, దుకాణాల్లో అలా చేయడానికి అసలు వీలుపడదు. తూర్పు ఉత్తర స్థలాల్లో కూడా సరుకులు పెట్టవలసి వస్తే ఆ గోడలకు తాకకుండా కనీసం నాలుగు అంగుళాల స్థలం వదిలేసి సరుకులు సర్దుకోవడం మంచిది. ఈశాన్య స్థలాన్ని మాత్రం పూజ కోసం వదిలివేయక తప్పదు. కనీసం ఒక చదరపు అడుగు స్థలం ఈశాన్య మూల ఖాళీగా (అంటే ఫ్లోర్ లెవెల్ నుండి సీలింగ్ లెవెల్ వరకు ఒక చదరపు అడుగుమేర) వదిలి పెట్టాలి. ఆ అడుగు స్థలం తరువాత తూర్పు గోడకు దేవుని పటం అమర్చుకుని పూజించడం వల్ల ఉత్తమ ఫలితాలు కలుగుతాయి.



యజమానిగానీ, కస్టమర్లుగానీ దుకాణంలోకి వస్తూనే ఎదురుగా దేవుని పటం కనిపించేలా అమరుస్తూ వుంటారు. అది మంచిదేగానీ ఎదురుగా కానీ, ద్వారబంధాల మీద గానీ లక్ష్మీదేవి పటాన్ని అమర్చడం వల్ల ఆర్థికంగా మంచి ఫలితాలు కనిపించవు. లక్ష్మీదేవి పటాన్ని పూజ మందిరాల వరకు పరిమితం చేయడం వల్ల ఆర్థికంగా సత్ఫలితాలు కలుగుతాయి. ద్వారబంధాల మీద లక్ష్మీదేవి పటాలుంచడం వల్ల ఆ పటం వీధిని చూస్తుండడం వల్ల అందాల్సిన ఆర్థిక లాభాల్లో అనుకూలంగా లేని చలనం ఏర్పడుతుంది.

దుకాణానికి వున్న సింహద్వారాన్ని బట్టి యజమాని ఆ దుకాణంలో ఎక్కడ కూర్చోవాలో నిర్ణయించుకోవాలి. అలాగే కస్టమర్ల నడక ఏ విధంగా దుకాణంలోకి సాగితే లాభాలు పెరిగే అవకాశం వుంటుందో కూడా తెలుసుకోవాలి.


**(మిగతా వచ్చే వారం)**

# మూర్ఖ జనం

అదొక పెద్ద స్మారక మందిరం. దాని ముందర ఓ తండ్రీ, కొడుకులు నిల్చున్నారు. ఆ దారమ్మట పోతున్నవారు, వస్తున్నవారు ఆ మందిరం ఏమిటని అడగడం మొదలుపెట్టారు.

తండ్రీ కొడుకులు తమకు తెలిసిన వివరాలు వారికి చెప్తున్నారు.

"ఈ చోట ఓ గొప్ప మహాత్ముడు సిద్ధి పొందారు. ఆయన సమాధి ఇక్కడ ఉండేది. అది ఉన్న చోటే ఇప్పుడీ మందిరం నిర్మించాం" అని ఆ మందిరం గురించి తమకు బాగా తెలిసినట్టు చెప్తున్నారు.

ఈ సమాచారం ఊరు ఊరంతా వ్యాపించింది. దాంతో ఆ మందిరాన్ని చూడటానికి ఎక్కడెక్కడి నుంచో జనం వచ్చిపోతున్నారు. ఈ మందిరం దగ్గర కాసేపు కూర్చుని వెళ్తే మనసుకి హాయిగా ఉంటుందన్నారు.



ఆ మందిరం ఆవరణలో ఉన్న హుండీలో డబ్బులు వేసేవారు వేస్తున్నారు. అక్కడ డబ్బులు చకచకమని పెరిగిపోయాయి.

రాబడి ఎక్కువవడంతో తండ్రీ కొడుకుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. డబ్బులెక్కువైనకొద్దీ మనుషుల మధ్య గొడవలు రావడం సహజమేగా.. ఎంతటి వారైనా కావచ్చు.

కొడుకు తరచూ తండ్రిని డబ్బులు అడగటం మొదలుపెట్టాడు.

తండ్రి ఇస్తూ వచ్చాడు. అతను బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు. కొడుకుని పిలిచాడు... "ఇదిగో చూడూ.. మన మధ్య గొడవలెందుకు? మనిద్దరం గొడవ పడుతున్నట్టు తెలిస్తే నలుగురూ నాలుగు విధాలుగా మాట్లాడుకుంటారు, నవ్వుకుంటారు, తప్పుగా అర్థం చేసుకుంటారు. కనుక మన మధ్య ఈ గొడవలు రాకూడదు.. ఏమంటావు?" అని తండ్రి అడిగాడు.

కొడుకు సరేనన్నాడు.

వెంటనే ఆ తండ్రి ఏం చేశారంటే–

కొడుకుకి కాస్త డబ్బు ఇచ్చాడు. తన దగ్గరున్న ఓ గాడిదపిల్లనూ ఇచ్చాడు. "వీటితో నీ బతుకు నువ్వు బతుకు. నీ దారి నువ్వు చూసుకో" అని తండ్రి కొడుకుని పంపించేశాడు.

కొడుకు ఆ గాడిదను తోలుకుని పొరుగున్న ఉన్న ఊరికి బయలుదేరాడు. అయితే మార్గంమధ్యంలో ఆ గాడిద చచ్చిపోయింది.

దాంతో ఏం చేయాలా? అని ఆలోచించాడు.

అతడికి ఓ ఆలోచన వచ్చింది. ఆ గాడిదను ఓ మూల పాతిపెట్టాడు. చేతిలో ఉన్న డబ్బుతో అక్కడ కళ్యాణ మండపం నిర్మించాడు.

ఆ దారిన వచ్చిపోతున్నవాళ్లు "అదేమిటీ?" అని అడిగారు.

"ఇక్కడ ఓ మహాత్ముడు సమాధి అయ్యారు" అన్నాడతను.

ఈ విషయం ఊరంతా పాకింది. చాలా మంది అక్కడికి వచ్చి ఆ మండపాన్ని చూడటం మొదలుపెట్టారు.

ఇక్కడికి వస్తే మనసుకి ప్రశాంతత ఏర్పడుతుంది" అనడంతో రోజు రోజుకీ అక్కడికి వచ్చేవారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. అక్కడ ఏర్పాటు చేసిన హుండీలో డబ్బులు వేస్తూ వచ్చారు. కొందరు నగలు కూడా వేశారు. దీంతో కొద్ది రోజులకే తండ్రిని మించిపోయాడు కొడుకు.

ఈ విషయం తండ్రికి తెలిసింది. కొడుకుని చూడటానికి బయలుదేరాడు. కొడుకు ఎంతో ఉల్లాసంగా ఉన్నాడు. విలాసవంతమైన జీవితం గడుపుతు న్నాడు. ఓ కొత్త బంగళా, కారు గట్రా కొన్నాడు.

తండ్రి కొడుకుని చూసి "ఇంత ఆస్తి ఎలా గడించావు?" అని అడిగాడు.

"నాన్నా! ఇదంతా మీ ఆశీర్వాదమే. మీరిచ్చిన మూలధనంతో ఇదంతా సంపాదించాను" అన్నాడు కొడుకు.

"అదెలా?" అని తండ్రి ప్రశ్నించాడు.

"నాన్నా, మీరు ఓ గాడిదపిల్లను, డబ్బులు ఇచ్చి నన్ను పంపించేసారు. వాటితో ఇక్కడికి బయలుదేరాను. అయితే దారిలో గాడిదపిల్ల కాస్తా చచ్చిపోయింది. ఏం చేయాలా? ఆలోచించాను. ఆ గాడిదను ఈ ఇక్కడ పాతిపెట్టాను. చేతిలో ఉన్న డబ్బుతో ఈ మండపం నిర్మించాను. అడిగిన వాళ్లకి ఓ మహాత్ముడు ఇక్కడ సమాధి అయ్యారని చెప్పాను. ఇంకేముంది.. ప్రజలు రావడం మొదలుపెట్టారు, హుండీలో డబ్బులు వేసారు. వాటితో నేను గట్టెక్కేసాను" అన్నాడు కొడుకు.

"బాగుందిరా! ఇప్పుడు నువ్వు నా కొడుకువనిపించు కున్నావు, ఆనందంగా ఉందిరా" అని కొనియాడాడు తండ్రి.

"ఎందుకలా అంటున్నావు?" అని అడిగాడు కొడుకు.

"గాడిదపిల్లను పాతిపెట్టి ఓ మండపం కట్టావు. మనం ఇప్పటికే ఆ ఊళ్లో మందిరం కట్టాం కదా! అది ఎవరిదనుకు న్నావు... అక్కడి సమాధి ఈ గాడిదపిల్ల తల్లిదే. దాన్ని పాతిపెట్టిన చోటే అది. అయితే అదొక మహాత్ముడి సమాధి అని కావాలనే అబద్ధం చెప్పానంతే" అన్నాడు తండ్రి. జనమంతా మూర్ఖులే అని తండ్రీ కొడుకులు పెద్దగా నవ్వారు, చప్పట్లు కొట్టారు.

రష్యాలో జరిగిన ఓ నాటకం కథ ఇది.

తమిళనాడులో తంద్రై పెరియారుగా ఖ్యాతి గడించిన ఈ.వి.రామస్వామి నాయకర్ 1932లో రష్యాకు పర్యటనకు వెళ్లినప్పుడు ఈ నాటకాన్ని తిలకించి ఎంతగానో ఆస్వాదించారట.

మనిషిని మనిషి మోసగించడం చాలా సులభం.

నాకు తెలిసిన ఓ వ్యక్తి ఉన్నట్టుండి ఆ ఓ రోజు అశరీరవాణి అంటూ ఏవేవో చెప్పడం మొదలుపెట్టాడు. అతను ఒక ఆఫీసులో పని చేస్తుండేవాడు. ఆఫీసులో తనతో కలిసి పని చేస్తున్న వారందరినీ తన మాటలతో నమ్మించాడు.

ఓరోజు నేనతని ఆఫీసుకి వెళ్లాను. అతనితో మాట్లాడుతుండగా ఆఫీసులో పని చేస్తున్న ఒక వ్యక్తి వాడి దగ్గరకు వచ్చాడు.

"స్వామీ, నా బల్ల మీదున్న ఖరీదైన పెన్ను కనిపించడం లేదండీ! అది దొరుకుతుందా లేదా చెప్పండి సామీ" అని అడిగాడు నా మిత్రుడిని.

నా మిత్రుడు కళ్లను చక్రాల్లా తిప్పి "అది నీకు దొరకదుగాక దొరకదు.. కొత్తది మరొకటి కొనుక్కో" అన్నాడు.

"సరే" అన్నాడతను.

అతను పక్కకు వెళ్లడంతోనే "అదెలా..! అది దొరకదు" అని నువ్వు అంత కచ్చితంగా ఎలా చెప్పావు?"అని అడిగాను.

అతను మెల్లగా లేచి నిల్చుని నా చెవిలో "ఆ పెన్నుని కొట్టేసింది నేనేగా" అన్నాడు.



**- యామిజాల జగదీశ్**

---

**(15వ పేజీ తరువాయి)**

వీళ్లు ముందుగా సిటీలో ఉన్న టాప్ మోస్ట్ స్కూళ్లని సెలెక్ట్ చేసుకొని ఆ స్కూళ్లలో చదివినట్టుగా ఫేస్‌బుక్‌లో ఒక ప్రొఫైల్ క్రియేట్ చేసుకుంటారు, తర్వాత ఫేస్ బుక్‌లో ఆ స్కూల్లో చదివి ప్రస్తుతం ఎవరెవరు కాలేజీలో చదువుతున్నారో వారందరికీ ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడతారు. ఆ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసేవాళ్లు మన స్కూల్లో చదివినవాడే కదా అని యాక్సెప్ట్ చేస్తారు. అప్పటికే ఆ బ్యాచ్‌లో మిగిలిన వాళ్లకి కూడా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడతారు. తర్వాత చాటింగ్ ద్వారా వారితో పరిచయం పెంచుకుని మన పర్సనల్ డేటా, పర్సనల్ ఫొటోస్, పర్సనల్ విషయాలు షేర్ చేసుకునే స్థాయికి తెలియకుండానే తీసుకువెళ్లిపోతారు.

తర్వాత వేరే అకౌంట్ నుండి ఫొటోలు, వీడియోలు చూపించి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు లాగేస్తారు. భారతదేశంలో ప్రతిరోజూ ఇలా మోసపోయిన అమ్మాయిల కేసులు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ఇందులో అబ్బాయిల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. దయచేసి రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసేముందు ముఖ్యంగా అమ్మాయిలు వాళ్ల మీకు పర్సనల్‌గా తెలిస్తేనే యాక్సెప్ట్ చేయాలి. లేదంటే బయట వ్యక్తులను ఎట్టి పరిస్థితిలో యాక్సెప్ట్ చేయవద్దు. అలాగే మీకు తెలిసిన వ్యక్తి అయినా, తెలియని



వ్యక్తి అయినా సరే ఎట్టి పరిస్థితులలో పర్సనల్ ఫొటోస్‌ని కానీ, పర్సనల్ వీడియోస్ గానీ, వీడియో కాల్స్ గానీ, మీ పర్సనల్ విషయాలనుగానీ ఎట్టి పరిస్థితులలో డైరెక్టుగా తప్ప ఆన్‌లైన్‌లో షేర్ చేయవద్దు. మరీ ముఖ్యంగా వీడియో కాల్స్ మాట్లాడేటప్పుడు దాన్ని కూడా స్క్రీన్ రికార్డర్ ద్వారా రికార్డు చేసే అవకాశం ఉందని గుర్తించాలి. ఏదైనా కొన్ని వెబ్ సైట్ విజిట్ చేసినప్పుడు పక్కన కొన్ని యాడ్స్ మనకు కనిపిస్తూ ఉంటాయి..

ఎలా అంటే రెహమాన్ పాటలు వినడానికి ఇక్కడ క్లిక్ చేయండి, ధోని సెంచరీ వీడియో కోసం ఇక్కడ క్లిక్ చేయండి, తెలుగులో రిలీజ్ అయిన కొత్త సినిమాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి, మీకు దగ్గరలో ఉన్న అమ్మాయిలను కలవడానికి ఇక్కడ క్లిక్ చేయండి. పొరపాటున ఇటువంటి యాడ్స్ మీద క్లిక్ చేస్తే మనల్ని పర్మిషన్ అడుగుతుంది. అది చూడాలన్న కంగారుతో అవేమీ పట్టించుకోకుండా యాక్సెప్ట్ ఒకే అని క్లిక్ చేస్తారు. మీరు ఆ వెబ్ సైట్‌ని విజిట్ చేసి మళ్లీ మీ పని మామూలుగా చేసుకుంటారు. కానీ మీకు తెలియని విషయం ఏమిటంటే మీ స్క్రీన్, మీరు ఎంటర్ చేసే పాస్‌వర్డ్ అన్నీ లింక్ తయారు చేసినవాళ్లకి కనిపిస్తాయి.

అలాగే ఎక్కడో దేశంలో ఉన్నవాళ్లు మీ వెబ్‌క్యామ్ ద్వారా మీ ఫొటోలు, వీడియోని కూడా మీకు తెలియకుండానే రికార్డు చేస్తాడు. తర్వాత మీ ఫొటోస్, వీడియోలు, డేటా మా వద్ద ఉంది అని బ్లాక్‌మెయిల్ చేసి మీ దగ్గర డబ్బులు మొత్తం లాగేస్తారు. ఒకవేళ మీరు కేసు పెడదామని చూసినా వాళ్లు ఏ దేశంలో ఉన్నారో కూడా కనిపెట్టలేం. కనుక దయచేసి ఎటువంటి తెలియని లింక్స్ క్లిక్ చేయవద్దు. మీ వర్క్ పూర్తి అయిన తర్వాత మీ వెబ్‌క్యామ్‌ను డిస్‌కనెక్ట్ చేయాలి. ఎట్టి పరిస్థితులలో మీ బెడ్ రూమ్‌లలో లాప్టాప్స్ గానీ సిస్టమ్స్ గానీ వాడకూడదు. ఒకవేళ వాడవలసి వస్తే సరైన జాగ్రత్తలు తీసుకుని వాడాలి. నేడు ప్రస్తుత సమాజంలో జరిగే ఇలాంటి సైబర్ క్రైమ్స్ అనేకం ఉన్నాయి. పైగా చాలా సైబర్ క్రైమ్ కేసుల్లో నిందితుల్ని పట్టుకోవడం చాలా కష్టం. ఒకవేళ పట్టుకున్నా వాళ్లు ఈ దేశంలో ఉండరు. ఒక వేళ ఉన్నా దొరకడం కష్టం. కనుక ఎవరి జాగ్రత్తలో వాళ్లు ఉంటూ మారుతున్న టెక్నాలజీలపై అవగాహన పెంచుకుంటూ ఉండాలి.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:**

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.** sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. పేరు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. శత్రువులు మిత్రులవుతారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. క్రయ-విక్రయాలు సామాన్యం. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది.

## వృషభం



ఆరోగ్య సమస్యలుంటాయి. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది, ఫలితాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి బాగుంటుంది.

## మిథునం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. కుటుంబ కలహాలు తీవ్రమవుతాయి. భాగస్వామ్య వ్యాపారులు సామరస్యంతో విడిపోతారు. దేవాలయాలు సందర్శిస్తారు. శత్రువులు మిత్రులవుతారు. ఆరోగ్య సమస్యలు తీరుతాయి. చోర భయం పొంచి వుంది, విలువైన పత్రాలు/వస్తువుల పట్ల జాగ్రత్త వహించండి. చర్చలు ఫలిస్తాయి.

## కర్కాటకం



సాహితీ మిత్రులను కలుసుకుంటారు. చిరకాల కోరిక తీరుతుంది. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగులకు అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి, ఖర్చులు కూడా ఎక్కువే. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. కళాకారులకు సన్మాన యోగం. వాహన యోగం.

## సింహం



విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఉంటాయి. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. శ్రమకు తగిన ఫలితం లభించకపోవచ్చు. విద్యార్థులకు విదేశీ యోగం. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో మెళకువలు నేర్చుకుంటారు. తాహతుకు మించిన రుణాలు చేయడం సముచితం కాదు. చర్చలు వాయిదా వేస్తారు.

## కన్య



నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. ఉద్యోగులు ఎదురు చూస్తున్న శుభ వార్తలు వింటారు. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. గతంలో వాయిదా పడిన పనులు పూర్తవుతాయి. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. మీకు వీలయినంతలో ఇతరులకు సహాయం చేస్తారు.

## తుల



ఊహించని సంఘటనలు జరుగుతాయి, సమయ స్ఫూర్తితో వ్యవహరించండి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. స్త్రీలకు స్థిరాస్తి లభిస్తుంది. సొంతింటి కల సాకారమవుతుంది. చిరు వ్యాపారులకు పోటీ పెరుగుతుంది. వృధా కాలక్షేపం చేస్తారు. కుటుంబంలో కలతలకు అవకాశం. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి.

## వృశ్చికం



వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. దైవ చింతన అలవర్చుకుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. శత్రువులు మిత్రులవుతారు. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఉద్యోగులకు అధికారుల వత్తిడి పెరుగుతుంది. శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. సంతాన విద్యా విషయం గురించి ఆలోచిస్తారు, ఆలోచనలు ఫలిస్తాయి. వస్తువుల కొనుగోలు-అమ్మకాలు వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి.

## ధనుస్సు



వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. పని వత్తిడి ఎక్కువవుతుంది. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించినవ పనులు సకాలంలో పూర్తి చేస్తారు. అనాథాశ్రమాలకు ఇతోధికంగా ఆర్థిక సహాయం చేస్తారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలించే సూచనలున్నాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వానుభవంతో తెలుసుకుంటారు. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది.

## మకరం



దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. సంఘంలో పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయి. శత్రువులు మిత్రులవుతారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు మరింత జటిలమవుతాయి. వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. విద్యా రంగంలో పని చేసేవారికి పదోన్నతులు లభించే సూచనలున్నాయి. సాహస నిర్ణయాలు తీసుకుంటారు.

## కుంభం



అందరూ మీ మాటే వేదవాక్కులా అనుసరిస్తారు. వృధా కాలక్షేపం చేస్తారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. తాహతుకు మించిన రుణాలు చేయడం మంచిది కాదు. డ్రైవింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండండి. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. సాహస నిర్ణయాలు అమలు చేస్తారు. దంపతుల మధ్య మనస్పర్థలకు అవకాశం, ఓర్పుతో ప్రవర్తించండి.

## మీనం



కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. విద్యార్థులకు విదేశీయాన యోగం. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి ఆర్థికంగా బాగుంటుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ అధికం.

# సరదాగా కాసేపు నవ్వుకోండి

## అంటించారు

కూతురు చీమ: అమ్మా నోరుమంట, అబ్బా నోరుమంట.
తల్లిచీమ: ఏమైంది?
కూతురు చీమ: సుబ్బమ్మ ఆంటీ ఇంట్లోకి పంచదార తిందామని వెళ్లాను. వాళ్లు కారం డబ్బాకి పంచదారని, పంచదార డబ్బాకి కారమని స్టిక్కర్లు అంటించారు.
తల్లి చీమ: అయితే వాళ్లూ తెలివి మీరిపోయారన్నమాట.

## నువ్వెరువు?

కాంతం: నువ్వెవరు? మా ఇంట్లో ఎందుకు వున్నావు?
పనిమనిషి: మీరు పుట్టింటికి వెళ్లిన తరువాత అయ్యగారు పెట్టుకున్న పని మనిషినండి.

## కంగారు పడేదెప్పుడు?

టీచర్: ఒరే, గోపి చేపల వేటకెళ్లిన జాలరి కంగారు పడేదెప్పుడురా?
గోపి: వలలో చేపలకు బదులు ఆర్టీసి బస్ పడినప్పుడు.

## బ్రాండెడ్

తల్లి ఎలుక: కిరాణా షాపులోకి వెళ్లి ఒట్టి చేతులతో తిరిగి వచ్చావేంటి?
కూతురు ఎలుక: వాడి షాపులో బ్రాండెడ్ బిస్కెట్ ప్యాకెట్లు లేవు.

- **వైదా ఈశ్వరరావు,** మిండి, విశాఖ

## అబద్ధం చెప్పారు

మగపెళ్లివారు: అమ్మాయికి వంట రాకపోయినా వచ్చని అబద్ధం చెప్పి మాకు అంటగట్టారు.
ఆడపెళ్లివారు: మా అబ్బాయికి వంట వచ్చినా కూడా రాదని మీరు అబద్ధం చెప్పారు. ఇప్పుడు అతనే చేస్తున్నాడు కదా..?

## ఓ నెల ఆగు..

ప్రియురాలు: మనం రేపు సినిమాకి వెళ్దామా?
ప్రియుడు: నెలరోజులు ఆగు. అట్టర్ ఫ్లాప్ సినిమాలు రిలీజ్ అవుతాయి. జనం ఎవరూ ఉండరు.

## కోల్డ్ వార్

టీచర్: కోల్డ్ వార్ అంటే ఏమిటి? అది ఎప్పుడు జరిగింది?
రమేష్: కోల్డ్‌వార్ అంటే బాగా చలిలో జరిగే యుద్ధం...అది జరిగింది చలికాలంలో టీచర్!



## హారన్ కొడితే..

టీచర్: గాల్లో విమానాలు ఢీకొనకుండా ఎలా ప్రయాణిస్తాయి?
కిట్టు: రోడ్లమీద వాహనాల లాగా విమానాలు కూడా ఎదురెదురుగా వచ్చినప్పుడు హారన్ కొడితే తప్పుకుంటాయి.

## సిసి కెమెరాలున్నాయి..

మొదటి దొంగ: ఆ నగల షాపులో దొంగతనానికి వెళ్లి దొంగతనం చెయ్యకుండా ఎందుకు వచ్చావు?
రెండవ దొంగ: అక్కడ బోర్డులో ఇలా రాసి ఉంది. 'సీసీ కెమెరాలను లైవ్‌లో పర్యవేక్షించే కంప్యూటర్ ఆపరేటర్ కలదు'.

## కూరగాయలూ అంతే!

టీచర్: మాంసాహారం తినడం వల్ల కడుపులో అల్సర్స్, మంట వస్తాయి. శాకాహారమే మేలు.
చింటూ: కూరగాయల రేట్లు కూడా మండుతున్నాయి టీచర్!
టీచర్: ఆ...

## పశువైద్యులు

రవి: మనిషికో మాట, గొడ్డుకో దెబ్బ అంటే ఆయన కోప్పడ్డాడు.
చింటూ: గొడ్డుకో దెబ్బ అంటే కోప్పడ్డాడంటే అతను పశువైద్యుడు కావచ్చు.

- **ఎస్.కె.యాకూబ్ పాషా, ఖమ్మం**

## నువ్వే నయం!

"నా భార్య ఆన్‌లైన్‌లో చేసే షాపింగ్ ఖర్చులు భరించలేక సన్యాసినయ్యాను, మరి మీరు" అన్నాడు మొదటి సన్యాసి రెండవ సన్యాసితో.
"మీరు కాస్త నయం. మా ఆవిడ యుట్యూబ్‌లో వచ్చే దిక్కుమాలిన వంటలన్నీ చేసి నన్ను తినమని బలవంతపెట్టడంతో ఆమె చేసే ప్రయోగాలకు భయపడి సన్యాసినయ్యాను" అన్నాడు రెండో సన్యాసి.

- **కె.లహరి,** కరీంనగర్

## నీ గురించే!

భార్య: ఏమండీ! టీవీలో అమ్మాయిని అలా నోరెళ్లబెట్టి చూడకపోతే అలా బజారుకెళ్లి కావాల్సిన సరుకులు తేవొచ్చుగా!
భర్త: అయ్యో! నీకలా అర్థమైందా? అలాంటి చీర నువ్వు కట్టుకుంటే ఇంకెంత అందంగా మెరిసిపోతావోనని ఆనందిస్తున్నానే.

## వాడి జీవితమూ అంతేనా?

భార్య: ఏమండీ! ఈ సంబంధం మన అబ్బాయికి కుదిరేటట్టే ఉందండీ!
భర్త: అయ్యో! ఇక వాడికి నాలా కష్టాలు మొదలవుతాయన్నమాట.

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com



**చిత్రభారతి**

**వాశిరాజు ప్రకాశం**

# సినిమా రంగం ఓ వైకుంఠపాళి

**1996వ** సంవత్సరం.. అంతవరకు కుంటుతూ, పడుతూ లేస్తూ వున్న దక్షిణాది సినిమా రంగం ఒక్కసారిగా వేయి వెన్నెల కాంతిరేఖలతో నింగి ఆకాశం ముద్దులాడింది. ముఖ్యంగా మలయాళ సినిమా రంగం మెరిసింది. కారణం.. సినిమా రంగమంతా పండగ చేసుకునే రీతిలో దక్షిణాది సినిమా 'ఛెమ్మీన్'కు తొలి స్వర్ణ పతకం లభించిందన్న వార్త అందరి హృదయాలను పలకరించింది. మలయాళ భాషలో 'ఛెమ్మీన్' అనే రొయ్య చేపలు రంగుల్లో విలసిల్లాయి, కమ్మగా, కన్నుల పండువగా. ఈ కథ ఒకసారి వింటే ఎవరూ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టరు. కారణం.. చేపల గురించి సినిమాలు తీయటం సాధ్యమా? నిజానికి యిది రొయ్యచేపల సినిమా కథ. ఆనాటి ప్రసిద్ధ మలయాళీ రచయిత తక్కాజీ శివశంకర పిళ్లై తన భాష పట్ల మమకారంతో, తన నేల మీద మమకారంతో రాసిన కథ.. గుండెలోతుల వ్యథ.




కేరళలోనే రొయ్య చేపల వ్యాపారంలో చాలా ముందడుగు వేసిన యువ మేధావి. తన స్వంత సంపాదనతో తీసిన రంగుల రసమంజరి. స్వంతంగా కణ్మణి ఫిలింస్ అనే నిర్మాణ సంస్థ నెలకొల్పారు. మనుషులు, మనసులు కలసిన వేళ ఎంత మహత్యమో, కణ్మణిబాబు రాముకారియత్ అనే సాహితీ పుంగవ మేధావిని దర్శకులుగా ఎంపిక చేశారు. అదొక కమ్మని స్వప్నం. అప్పటికే కొద్దిపాటి దర్శకుడిగా వెలుగులోకి వస్తున్న దర్శకుడు రామూకారియత్‌ను కలిసి కథ వినిపించారు. అప్పటికే నేల నాలుగు చెరగులా ఖ్యాతి గాంచిన 'ఛెమ్మీన్' కథను సినిమా తీసే అవకాశంగా వస్తే ఎవరు కాదంటారు. అదో అరుదైన అవకాశమని అర్థమవుతుంది. వెంటనే రామూకారియత్ తన ప్రతిభా వైభవాన్ని పంచుకున్నారు, పండించుకున్నారు.


నిర్మాత కణ్మణిబాబు రొయ్యల ప్రముఖ వ్యాపారి కనుకనే రొయ్యల చుట్టూ పరిభ్రమించే 'ఛెమ్మీన్' కథను ఎన్నుకున్నారు. ఈ కథలో పాత్రలన్నీ సాగరతీరం చెంతనే ఆడుతుంటాయి, పాడుతుంటాయి. కథానాయకుడు సత్యన్ కథ ప్రకారం చేపలు పట్టటంలో నిష్ణాతుడు. అలాగే చిన్న వ్యాపారి. హీరో అందగాడే కానీ వ్యాపారం సాగాలి కదా! ఆ కుటుంబంలోనే కొట్టార్కర శ్రీధర్‌నాయర్ అందరికీ పెద్ద. అతని కూతురు కలల రాజు దొరక్కపోతే అందంలో తన కంటే ఓ మెట్టు తక్కువ యిన సత్యన్ భర్తగా ఖాయం అవుతాడు. హీరోయిన్ కారుతమ్మకు ఆ నల్లటి హీరో నచ్చయకపోయినా తండ్రి మాట జవదాట లేక ఆ వివాహానికి అంగీకరించింది. కొట్టార్కర శ్రీధర్‌నాయర్ చెప్పిన లోక సత్యం "కారుతమ్మా! నీకు కుటుంబ భారాన్ని పోషించగలవారు కావాలి. వర్షాలు, కవితలు, చంద్రుడు, వెన్నెల అన్నం పెట్టవు. అందుకే సత్యన్ న్యాయమైన వరుడు" అని చెప్తాడు.

అదే సమయంలో సత్యన్ సాగర తీరంలోకి వెళుతుంటే అతను చూపిన ధైర్య సాహసాలు చూసి ఆ ఊరంతా ఆనందించింది. కాలం కలిసి రాకపోతే అది ఏదాది తీసుకువెళుతుందే మరి! ఆ సమయంలోనే కారుతమ్మ హీరో మధు ప్రేమలో పడి, చివరకు సముద్రపు అలలకు చేరువవుతారు. కారుతమ్మ చెల్లెలు 'పంచమి' అక్క కోసం వెదుకుతూ.. వెదుకుతూ వెళ్లే హృదయ విదారక దృశ్యం యిప్పటికీ వెన్ను తట్టి పిలుస్తుంది. కానీ సాగరుడు దయామయుడు కాదు. ప్రేమ చరిత్ర పిలుస్తుంది. పంచమి అక్క కోసం యింకా వెదుకుతూనే వుంది. మనకయినా కనిపిస్తే బావుండు. పంచమికి సహకరించే వాళ్లం. ఇంత చక్కని కథను సినిమాగా మలచి, హరివిల్లులా కదిలించిన దర్శకులు రామూకారియత్ 'ఛెమ్మీన్' సినిమాతో ప్రపంచ స్థాయి దర్శకులయ్యారు. పత్రికలు ఆ మేధావికి అభినందనలు తెలిపాయి. ఆ చిత్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. మళ్లీ అలాంటి సినిమా యింతవరకు దక్షిణాది భాషల్లో తయారయిన చరిత్ర కానరాదు. దర్శకులు రామూకారియత్ తదుపరి చరిత్ర ఒక వైకుంఠపాళిలా సాగింది. 'ఛెమ్మీన్' వైభవం మసకబారింది. తప్పనిసరి పరిస్థితుల్లో 'ఏళురాత్రిగళల్' చిత్రానికి దర్శకుడు అయ్యారు. కారియత్ చరిత్రలో ఒక్క రాత్రి కూడా తెల్లవారలేదు. ఆర్థికంగా చితికిపోయారు.

మరో సినిమా రాలేదు. కథ అంధకారమైంది. ఈ సమయంలో రామూకారియత్ ఆరోగ్యం క్షీణించింది. ఆయన స్వగ్రామమైన తిరుచూరులో కన్ను మూసిన విషాద ఘడియల్లో ఆ ఊరంతా కన్నీరు కార్చింది. ఆ కన్నీటికి అంతం ఎక్కడో? ఎన్నడో? సినిమా రంగం ఎవరికీ స్వంతం కాదు, అన్నీ ఎండమావులే. ఈ సత్యానికి అతీతులైనవారు అదృష్టవంతులు. ఏమయినా అందరూ బావుండాలి..ఈ వెన్నెల జల్లు శాశ్వతం కావాలి సుమా! ◆


..వంట చేయకుండా వెళ్తారుగా.. మీకు ఒక్కళ్లేనేమో
అనుకుని..నా ఒక్కదానికే వండుకుని తినేశా...!!
Zakir...


...అలవాటు లేదు గానీ.. ఫ్రీగా వచ్చేదాన్ని
ఎందుకు వదులుకోవాలి..? అని...
Zakir...


.. ఎటు చూసినా క్లౌడ్ బరస్టింగే... ముక్కెనుక ముక్క..
పుల్లెనుక పుల్ల పడుతూనే ఉన్నాయి మావా..!!
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'




# ఫోటో ఫీచర్







స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరం కుడ్య చిత్రాలకు ప్రసిద్ధి గాంచింది. ఏ ఒక్క భవనమూ ఖాళీగా కనిపించదిక్కడ. పర్యావరణం, సమాజం, జీవనం, జంతు ప్రేమకు సంబంధించిన అంశాల మ్యూరల్స్ గోడల పైన చిత్రిస్తారు. ఈ నగరాన్ని మ్యూరల్ ఆర్టిస్టుల నగరం అని కూడా అంటారు. గ్లాస్గో మ్యూరల్ ట్రెయిల్ పేరుతో నగరంలోని అన్ని పెయింటింగ్స్‌ను చూడటానికి రెండు రోజులు పడుతుందట.